Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 65 పేజీలు 8 వెల : 5 మంగళవారం 26 ఆగష్టు 2025








# వైద్యారోగ్యంలో

## వినూత్న ఆవిష్కరణల వేదిక 'బ్రెయిన్'

**రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో భాగంగా ఏర్పాటు**

**అంతర్జాతీయ బయోడిజైన్ నిపుణులతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ**

అమరావతి: వైద్యారోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణల కోసం భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ (బ్రెయిన్) కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అమరావతిలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో అంతర్భాగంగా బ్రెయిన్ కార్యకలాపాలుంటాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ, స్థానిక నైపుణ్యాలను సమన్వయం చేయడం ద్వారా ప్రజారోగ్య రంగంలో గణనీయమైన మార్పులు తెస్తుందని వెల్లడించారు. సచివాలయంలో సోమవారం ఆసియా పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్‌కు చెందిన వేర్వేరు దేశాల వైద్య నిపుణులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఏఐ, మెడ్‌టెక్ అలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆసియా- పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్, అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ బయోడిజైన్ సంయుక్త భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆరోగ్య రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా 'బ్రెయిన్' దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడమే లక్ష్యంగా ఇది పనిచేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా మెడికల్ టెక్నాలజీ రంగంలో కొత్త స్టార్టప్‌లతో పాటు పరిశోధకులు, నిపుణులకు ప్రోత్సాహం లభిస్తుందని సీఎం తెలిపారు.

**స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాల్లో ఒప్పందాలు**

ఆస్ట్రేలియా, అమెరికా, ఇజ్రాయెల్, జపాన్, సింగపూర్, తైవాన్, ఐర్లాండ్ తదితర దేశాలకు చెందిన వైద్య నిపుణులు ఆయా దేశాల్లో బయోడిజైన్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏఐ, మెడ్‌టెక్ అలయన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్ కలపాలతో పాటు ప్రొఫెసర్ అనురాగ్ మైరల్ (స్టాన్‌ఫోర్డ్ సెంటర్ ఫర్ బయోడిజైన్), డాక్టర్ యోనా వైస్‌బచ్ (ఆసియా పసిఫిక్), కెవిన్ ఫ్లెగర్ (ఆస్ట్రేలియా), యూరియోన్ కొబయాషి (జపాన్), జేమ్స్ చియెన్, హియాట్సెంగ్ (తైవాన్), మార్క్ చాంగ్ (సింగపూర్) తదితరులు తమ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలకు సాంకేతిక పరిష్కారాలపై చర్చించారు. వైద్యారోగ్య రంగంలో పరిశోధన, శిక్షణ, సాంకేతికత బదిలీ, స్టార్టప్, ఇంక్యుబేషన్‌తదితర విభాగాల్లో సహకారంపై ప్రపంచ నిపుణులు- ఏపీ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా, ఎయిమ్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం జరిగింది.

దీంతో భారత్ బయోడిజైన్, బయోడిజైన్ ఆస్ట్రేలియాలు ఉమ్మడిగా పని చేయనున్నాయి. వైద్యారోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, విద్యార్థులకు ప్రత్యేక కోర్సులను నిర్వహించేలా ఇది సహకరించనుంది.

**డీజీనెర్వ్ సెంటర్ సేవల విస్తరణ**

'రాష్ట్రంలో ప్రజారోగ్య సేవల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నాం. పీహెచ్‌సీలతో ఏరియా ఆస్పత్రులను అనుసంధానించాం. చిత్తూరు జిల్లా కుప్పంలో టాటా-గేట్స్ ఫౌండేషన్‌లతో కలిసి డీజీనెర్వ్ సెంటర్ ఏర్పాటుచేశాం.

## ఇంజినీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులకు

# అవకాశాలు

**రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్**

**పలు పరిశ్రమలకు ఈఈపీసీ అవార్డుల ప్రదానం**

**విజయవాడ:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న నూతన పారిశ్రామిక విధానం వల్ల మన ప్రాంతం నుంచి ఇంజినీరింగ్ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అయ్యే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ నోవోటెల్ హొటల్‌లో సోమవారం కేంద్ర వాణిజ్య పరిశ్రమ మంత్రిత్వ శాఖ, ఇంజినీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఈఈపీసీ) ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి అత్యుత్తమ పనితీరు, ఎక్కువ ఎగుమతులు చేసిన ఇంజినీరింగ్ ఉత్పత్తుల పరిశ్రమలకు అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. మంత్రి మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డులు అందజేశారు. లార్జ్ ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్ (చెన్నై) 2021-22, 2022-23 సంవత్సరాలకుగాను గోల్డ్ ట్రోఫీ అందుకుంది. మీడియం ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో థర్మోప్యాడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) 2021-22 సంవత్సరానికి, ఐజీపీ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (చెన్నై) 2022-23 ఏడాది గాను గోల్డ్ ట్రోఫీ అవార్డులు అందుకున్నాయి. వాటితో పాటు 91 కంపెనీలకు వివిధ విభాగాల్లో అవార్డులు

ప్రదానం చేశారు. మంత్రి మాట్లాడుతూ... భారతదేశం నుంచి 2024-25 ఏడాదిలో జరిగిన మొత్తం ఎగుమతుల్లో 26 శాతం ఇంజినీరింగ్ ఉత్పత్తులే ఉన్నాయని, అందులో దక్షిణాది రాష్ట్రాల నుంచే 32 శాతం ఉండడం అభినందనీయమని అన్నారు. ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ అభిషిక్త్ కిషోర్, ఈఈపీసీ ఇండియా రీజనల్ ఛైర్మన్ రమణ్ రఘు, వైస్ ఛైర్మన్ ఆకాశ్‌షా, డిప్యూటీ రీజనల్ ఛైర్మన్ శశి లూయిస్, రీజనల్ డైరెక్టర్ రాజగోపాలరావు, సెక్రటరీ ఆదిప్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.







# ప్రధాని జైలుకెళ్లినా..

## రాజీనామా చేయాల్సిందే

**'రాజ్యాంగ సవరణ'పై విపక్షాలకు అమిత్ షా కౌంటర్**

**జగదీప్ ధన్‌ఖడ్ హౌజ్ అరెస్ట్ ఆరోపణలు**

**విపక్షాల తీరును తప్పు పట్టిన అమిత్ షా**

**ఆయన అనరోగ్య కారణాలతో రాజీనామా చేశారు**

**దీనిపై రాద్ధాంతం చేయడం తగదని షా హితవు**

# అనుమతి లేకపోతే

## కేబుల్ వైర్లు తొలగించొచ్చు

హైదరాబాద్: విద్యుత్ స్తంభాలపై ఇంటర్నెట్, కేబుల్ వైర్ల తొలగింపుపై సోమవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఇటీవల రామంతాపూర్ విద్యుత్ ప్రమాద ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్ల వల్లనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్లను సిబ్బంది తొలగిస్తున్నారు. దీంతో ఎయిర్‌టెల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అనుమతి తీసుకున్న కేబుళ్లను సైతం తొలగిస్తున్నారని సంస్థ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఏయే స్తంభాలకు అనుమతి తీసుకున్నారో చూపించాలని టీజీఎస్పీడీసీఎల్ తరఫు న్యాయవాది కోరారు. వాదనలు విన్న ధర్మాసనం అనుమతిలేని కేబుళ్లను తొలగించొచ్చని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.



## ఉద్రిక్తతల మధ్య భారత్ మానవత్వం.. పాకిస్థాన్ కు కీలక హెచ్చరిక!




**పాకిస్థాన్‌కు వరద హెచ్చరికలు జారీ చేసిన భారత్**

**జమ్మూలోని తావి నదికి భారీ వరద ముప్పుపై సమాచారం**

**దౌత్య కార్యాలయం ద్వారా ఇస్లామాబాద్‌ను అప్రమత్తం చేసిన భారత్**

న్యూఢిల్లీ: పాకిస్థాన్ తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, భారత ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించింది. జమ్మూలోని తావి నదికి భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్‌ను అప్రమత్తం చేసింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు అత్యంత క్లిష్టంగా ఉన్న తరుణంలో, దౌత్య మార్గాల ద్వారా ఈ సమాచారాన్ని అందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్ మీడియా వర్గాల కథనాల ప్రకారం, ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ ఆదివారం ఈ మేరకు పాక్ ప్రభుత్వానికి సమాచారం అందించింది. సాధారణంగా సింధు జలాల ఒప్పందం కింద ఇరు దేశాల కమిషనర్ల మధ్య ఇలాంటి సమాచార మార్పిడి జరుగుతుంది. అయితే, పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత ఈ ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. అప్పటి నుంచి ఒప్పందం కింద సమాచార మార్పిడి జరగడం లేదు. ఈ నేపథ్యంలో దౌత్య కార్యాలయం ద్వారా హెచ్చరికలు పంపడం ఇదే తొలిసారి. భారత్ నుంచి అందిన సమాచారంతో పాకిస్థాన్ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారని, నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారని తెలుస్తోంది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ తీసుకున్న కఠిన చర్యలలో భాగంగా సింధు జలాల ఒప్పందాన్ని పక్కనపెట్టింది. అప్పటి నుంచి మూడు నదులకు సంబంధించిన నీటిమట్టాల వివరాలను పాక్‌తో పంచుకోవడం లేదు. రుతుపవనాల సమయంలో భారత్ ఇచ్చే ఈ సమాచారం, పాకిస్థాన్‌లో వరద నష్టాన్ని తగ్గించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇటీవల మే నెలలో ఇరు దేశాల మధ్య సైనిక ఘర్షణ వాతావరణం నెలకొన్న తర్వాత, సంబంధాలు మరింత క్షీణించిన తరుణంలో భారత్ ఈ చర్య తీసుకోవడం ఒక సానుకూల పరిణామంగా అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ విషయంపై ఇరు దేశాల ప్రభుత్వాల నుంచి ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# కోదండరామ్‌పై మొసలి కన్నీరు



హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో సీఎం రేవంత్ రెడ్డి సొల్లు పురాణం మాట్లాడారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ విమర్శించారు. సోమవారం బీఆర్ఎస్ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదండరాం పట్ల రేవంత్ రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నారు. రేవంత్ రెడ్డిని హీరోగా పెట్టి ఆహా నా పెళ్లంట సినిమా తీయాలని ఎద్దేవా చేశారు. ఓయూకు వెయ్యి కోట్లు- ఇవ్వాలన్నారు. కోదండరామ్ సీఎం పదవికి రేవంత్ రెడ్డి కంటే అర్హుడుఅన్నారు. రేవంత్ రెడ్డి సీఎం పదవి నుంచి దిగిపోయి కోదండరామ్ కు సీఎం పదవి అప్పగించాలని సూచించారు. నేను రాజకీయాల్లోకి రియల్ ఎస్టేట్ దందాల కోసం రాలేదన్నారు. నేను ఏ పార్టీలో ఉన్నా ప్రజల కోసం పనిచేశానని స్పష్టం చేశారు. మా కష్టానికి, త్యాగానికి విలువ లేదా? ఎరుకుల బిడ్డ కుర్రా సత్యనారాయణకు ఎమ్మెల్సీ ఇస్తే అడ్డుకున్నారని అన్నారు. మేము కోదండరామ్ ను అడ్డుకోలేదు. మా గొంతుకోయడం కోసం కోదండరామ్ ను రేవంత్ రెడ్డి అడ్డుపెట్టారన్నారు. కోదండరామ్ తో రేపు పొద్దున మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కోదండరామ్ ను నిలబెట్టాలని సవాల్ విసిరారు. కోదండరామ్ ను లిటిగేషన్ లో ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. సీఎం కుర్చీని గౌరవించాలని అంటున్న రేవంత్ రెడ్డి మంత్రి పదవిని, వైస్ ఛాన్సలర్ పదవిని ఎందుకు గౌరవించడం లేదన్నారు.స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అంటే అందరికి ఆత్మీయత ఎక్కువ. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సావాస దోషాలతో రేవంత్ రెడ్డి లైన్‌లో నడుస్తున్నారన్నారు. అప్పులపై స్పీకర్ అబద్దాలు చెప్పారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన రూ.3 లక్షల 50 వేల 520 కోట్లు- అని పార్లమెంటులో కేంద్రమంత్రి అన్నారు. రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి దింపి స్పీకర్ ప్రసాద్ కుమార్ సీఎం కావాలన్నారు. పార్లమెంట్‌లో రఘునందన్ రావు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి అప్పులపై సమాధానం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ కోసం యాదయ్య, శ్రీకాంతాచారి ఆత్మబలిదానా లు చేసుకుంటే రేవంత్ మాత్రం చంద్రబాబు నాయుడు సంకలో ఉన్నారని ఎద్దేవా చేశారు. నేను కుమార్‌ను ఓయూ వైస్ ఛాన్సలర్ ను చేశామని రేవంత్ రెడ్డి అన్నారు. దీంతో రేవంత్ రెడ్డి ఫ్యూడలిజం, భూస్వామ్య మనస్తత్వం బయటప డిందన్నారు. ఓయూలో కాళేశ్వరం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు . జీవో 29 పేరు మీద రేవంత్ రెడ్డి విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు. కోర్టుల్లో ఉన్న అంశాల గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. కోర్టులను, కోర్టు తీర్పులను రేవంత్ రెడ్డి అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డిని సీఎం చేసేందుకు నిరుద్యోగులు బస్సులు వేసుకుని రాష్ట్రం మొత్తం తిరిగారు. 60వేల ఉద్యోగాలు రేవంత్ రెడ్డి గుర్తించిన ఉద్యోగాలా? సృష్టించిన ఉద్యోగాలా? అని ప్రశ్నించారు. హెచ్‌సీయూలో రేవంత్ రెడ్డి చంపింది ఏనుగులు, సింహాలను కాదు జింకలు, నెమళ్లను చంపారన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డికి భయం మొదలైంది. ఉస్మానియా భూములను బీఆర్ఎస్ ప్లాట్లు- చేసుకుని అమ్ముకుంటారని రేవంత్ రెడ్డి అంటున్నారు. గచ్చిబౌలి భూములను ప్లాట్లు- చేసి అమ్ముకున్నది ఎవరో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఉస్మానియాను స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్‌లా అభివృద్ధి చేద్దాం

హైదరాబాద్: తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా యూనివర్సిటీ అని, తెలంగాణ, ఉస్మానియా రెండూ అవిభక్త కవలల్లాంటివని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చదువుతోపాటు పోరాటాన్ని నేర్పించే గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అన్నారు.. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు.. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది కూడా ఉస్మానియా యూనివర్సిటీ అన్నారు. ఉస్మానియా వర్సిటీలో రూ.90 కోట్లతో నిర్మించిన భవనాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. దుందుభి, భీమా వసతి భవనాలను ప్రారంభించిన అనంతరం.. డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, కోదండరామ్, ఓయూ వీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించిన సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు.. ఉస్మానియా యూనివర్సిటీని కాలగర్భంలో కలపాలని చూశారని మండిపడ్డారు. కానీ ఓయూకు పూర్వ వైభవం తీసుకురావాలని తాము నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆ క్రమంలో 108 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీకి దళితుడిని వీసీ చేసి చూపించామన్నారు. దేశానికి యువ నాయకత్వం అవసరమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి పురిటి గడ్డ ఉస్మానియా వర్సిటీనేనని గుర్తు చేశారు. యూనివర్సిటీలు సమస్యలపై చర్చలకే కాదు..సైద్దాంతిక అంశాలకు వేదిక సైతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సామాజిక, సాంకేతిక అంశాలపై చర్చలు జరపాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. 1938 సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదిన గడ్డ ఇది.. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన శివరాజ్ పాటిల్, పీవీ నర్సింహారావు ఈ యూనివర్సిటీ విద్యార్థులే.. ఉత్తమ పార్లమెంటే రియన్‌గా గుర్తింపు పొందిన జైపాల్ రెడ్డి ఈ యూనివర్సిటీ విద్యార్థినే.. తెలంగాణ నలుమూలలా ఏ సమస్య వచ్చినా మొదట చర్చ జరిగేది యూనివర్సిటీలోనే..అని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారిది ఉస్మానియా యూనివర్సిటీనే.. యాదయ్య, ఇషాన్ రెడ్డి,



వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర సాధనలో సమిధలయ్యారు.. ఎంతో మంది మేధావులను అందించిన ఘనత ఉస్మానియా యూనివర్సిటీది.. గత పదేళ్ల పాలనలో ఉస్మానియా యూనివర్సిటీని నిర్వీర్యం చేసే కుట్ర జరిగింది.. ఉస్మానియా యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకురావాలని మేం ఆలోచన చేశాం.. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించాం.. చదువుకుని చైతన్యం ఉన్న వారిని వీసీలుగా నియమించాం.. తెలంగాణ సమాజాన్ని చైతన్యపరిచే మేధా సంపత్తిని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆశిస్తున్నాం.. అన్నారు. దేశానికి యువ నాయకత్వం అవసరం.. దేశంలో 60 శాతం జనాభా 35 ఏళ్ల లోపు వారే.. ఇది మన దేశ సంపద.. 21 ఏళ్ల వయసులో దేశానికి సేవలంది స్తున్నప్పుడు.. 21 ఏళ్ల యువకులు శాసన సభలో ఎందుకు అడుగుపెట్టకూడదు?.. తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఆవేదన కలుగుతోంది.. యువతను గంజాయి, డ్రగ్స్ వ్యసనాలు పట్టి పీడిస్తున్నాయి.. గంజాయి, డ్రగ్స్ యువతను నిర్వీర్యం చేస్తున్నాయి.. ఆ వ్యసనాల నుంచి యువతను బయటపడేలా చేయాలి.. చదువు, చైతన్యం ఉంటేనే సమాజంలో రాణిస్తారు.. నా దగ్గర పంచడానికి భూములు లేవు, ఖజానా లేదు మీకు నేను ఇవ్వగలిగింది విద్య ఒక్కటే.. అన్నారు. మీ తలరాతలు మార్చేది చదువొక్కటే.. చదువు ఒక్కటే మిమ్మల్ని ధనవంతుల్ని చేస్తుంది, గుణవంతులను చేస్తుంది.. పేదరికం మాకు కొత్త కాదు.. ఆ పేదరికాన్ని చూసి వచ్చినవాళ్ళం.. పేదరికాన్ని పారద్రోలడం మాకంటే ఎక్కువ ఎవరికీ తెలియదు.. యూనివర్సిటీ అభివృద్ధి అధ్యయనానికి ఇంజనీర్స్ కమిటీ వేయాలని అధికారులను ఆదేశిస్తున్నా.. ఉస్మానియా యూనివర్సిటీని స్టాన్ ఫర్డ్, ఆక్స్ ఫర్డ్ స్థాయిలో తీర్చిదిద్దుతాం.. ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రకు నిలువెత్తు సాక్షిగా నిలవాలి.. ఉస్మానియా యూనివర్సిటీ- లేకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదు.. యూనివర్సిటీ- అభివృద్ధికి ఏం కావాలో అడగండి.. అంచనాలు తయారు చేసి ఇవ్వండి..అని అన్నారు. మళ్లీ యూనివర్సిటీకి వస్తా.. ఆర్ట్స్ కాలేజీ వద్ద మీటింగ్ పెట్టి నిధులు మంజూరు చేస్తా..పోలీసులకు నేను ఆదేశిస్తున్నా.. ఆ రోజు యూనివర్సిటీ లో ఒక్క పోలీస్ కనిపించొద్దు.. నిరసన తెలిపే వారిని నిరసన తెలపనివ్వండి.. నేను రావొద్దని అడ్డుకునే వారికి సమాధానం చెప్పే చిత్తశుద్ధి నాకుంది.. కొంతమంది రాజకీయ నాయకులకు పదవులు పోయాయన్న ఆవేదన ఉంటుంది.. వాళ్ల కొడుకులను ఏదో చేద్దామనుకుంటే ఏదో అవుతున్నారని బాధ ఉంటది.. వారి ఉచ్చులో మీరు పడొద్దు.. సమస్య ఉంటే మాకు చెప్పండి.. మా మంత్రులు మీకు అందుబాటులో ఉంటారు.. కోదండరామ్ సార్ పై కుట్ర చేసి సుప్రీం కోర్టుకు వెళ్లి పదవి తొలగించారు.. ఇదేం పైశాచిక ఆనందం.. మళ్లీ కోదండరాం సార్ కు ఎమ్మెల్సీ ఇస్తాం..అని ప్రకటించారు. అపోహలకు లోను కాకండి.. అబద్ధాల సంఘం చెప్పే మాటలు నమ్మొద్దు..వాట్సాప్, సోషల్ మీడియాలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో సెంట్రల్ యూనివర్సిటీలో సింహాలు, ఏనుగులు ఉన్నాయని ప్రచారం చేసి అడ్డుకున్నారు.. తెలంగాణలో సింహాలు, ఏనుగులు లేనేలేవు.. మానవ రూపంలో ఉన్న మృగాలు ఉన్నాయి.. వాళ్లు తెలంగాణ సమాజానికి పట్టిన చెదలు లాంటివారు.. వాళ్లు తెలంగాణ సమాజం బాగు కోరుకోరు.. వాళ్లు మళ్లీ వస్తే ఉస్మానియా యూనివర్సిటీని ఉండనివ్వరు.. మీ చదువుకు ఏం కావాలో అడగండి.. ఉస్మానియా యూనివర్సిటీని అభివృద్ధి చేసే బాధ్యత నాది అని సీఎం రేవంత్ తెలిపారు.

# ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ మోసం



హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ- పర్యటన నేపథ్యంలో విద్యార్థులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంపై నిషేధాజ్ఞలు విధిస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నదని చెప్పారు ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఇనుప కంచెలు, బ్యారికెడ్లతో ప్రజా తిరుగుబాటును ఆపలేరు. పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు.ఉస్మానియా విద్యార్థి, నిరుద్యోగులు సింహాలై గర్జిస్తరు. ఉద్యోగాల పేరిట మీరు చేసిన మోసాన్ని ఎక్కడిక్కడ నిలదీస్తరు. మోసం చేసినందుకు ఉస్మానియా సాక్షిగా విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా రేవంత్ రెడ్డి చేసిందేముందన్నారు. జాబ్‌క్యాలెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ-కి వస్తున్న సందర్భంగా విద్యార్థులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామిక, పిరికిపంద చర్య అన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఒక్క విద్యార్థి మీద పోలీసు లాఠీ పడినా తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరిస్తున్నాం. ఇందుకేనా విద్యాశాఖను, హోం శాఖను మీ వద్ద పెట్టు-కున్నది. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నది. మొత్తం తెలంగాణ సమాజం మీద నిషేధాజ్ఞలు విధిస్తారా... ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పాలన అని చెప్పి, ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెచ్చిండు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇవ్వడం. కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా నువ్వు చేసింది ఏముంది రేవంత్ రెడ్డి?. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేసారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేసారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేసారు. 22నెలల్లో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు- తప్పుడు ప్రచారం చేస్తున్నావు. నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నవని మండిపడ్డారు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవు. గ్రంథాలయాల్లో పోలీసు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు.

# ప్రధాని జైలుకెళ్లినా.. రాజీనామా చేయాల్సిందే

దిల్లీ: ముఖ్యమంత్రి అయినా.. ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం మంచి విషయమేనా? అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశ్నించారు. మన ప్రజాస్వామ్యానికి అది మర్యాదపూర్వకంగా ఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు. ప్రముఖ జాతీయ మీడియా సంస్థ 'ఏఎన్‌ఐ'కి అమిత్ షా ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈసందర్భంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా అంశం పైనా స్పందించారు.

"విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటుచేయగలమని అనుకుంటున్నారు. వారు జైలునే సీఎం, పీఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారు. అప్పుడు డీజీపీ, చీఫ్ సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి సిద్ధాంతాలను నేను, మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదు" అని అమిత్ షా అన్నారు.

వాదోపవాదాల్లేకుంటే చట్టసభలు జీవంలేని రాతి భవనాలే

"ప్రధాని గానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే.. ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలి. లేదంటే తమతమ పదవులకు రాజీనామా చేయాలి. అలా చేయకపోతే.. చట్టమే



వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నాం. చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుంది. ఈ నిబంధన ప్రధాని పదవికి కూడా వర్తించేలా స్వయంగా నరేంద్రమోదీనే దీన్ని సవరణలో చేర్చారు. ఆయనకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రధాని జైలుకెళ్తే ఆయనైనా రాజీనామా చేయాల్సిందే. ఎన్నికైన ప్రభుత్వం రాజ్యాంగ సవరణను తీసుకొస్తే దానిపై అభ్యంతరాలు లేవనెత్తే హక్కు అందరికీ ఉంటుంది. అంతేగానీ, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కూడా అవకాశం లేకుండా ఆందోళనలు చేస్తే ఎలా?" అని ప్రతిపక్షాలపై హోంమంత్రి మండిపడ్డారు. ఈ బిల్లు కచ్చితంగా పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

**నైతికత గురించి నాకు చెప్పొద్దు..**

130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై విపక్షాల ఆరోపణలను అమిత్ షా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా 2013 నాటి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై ధ్వజమెత్తారు. "రాజ్యాంగ సవరణ బిల్లులో నైతికత లేదని విపక్షాలు అంటున్నాయి. నాడు లాలూ యాదవ్‌ను కాపాడేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను రాహుల్ గాంధీ చింపేశారు. ఆ రోజే ఆయన నైతికతతో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఈ రాజ్యాంగ సవరణపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోంది. వరుస వైఫల్యాలతో ఆ పార్టీ ఆలోచనావిధానం మందగించి ఉంటుంది" అని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు.

ధన్‌ఖడ్ రాజీనామా.. ఎక్కువగా లాగొద్దు

ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అంశాన్నీ ఆయన ప్రస్తావించారు. "ధన్‌ఖడ్‌జీ రాజ్యాంగ పదవిలో కొనసాగారు. ఆయన పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేశారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మరీ ఎక్కువగా లాగొద్దు. కేవలం ప్రతిపక్షాల ఆరోపణల ఆధారంగా దీనిపై ఓ అంచనాకు రావడం సరికాదు" అని అమిత్ షా స్పష్టం చేశారు. త్వరలో జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నిక గురించి ప్రస్తావిస్తూ.. "రాష్ట్రపతిని తూర్పు భారతం నుంచి ఎన్నుకున్నాం. ఇప్పుడు ఉపరాష్ట్రపతి దక్షిణాది నుంచి ఉండాలని అనుకున్నాం. దీనికి, తమిళనాడు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదు" అని తెలిపారు.

## రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిన నాదెండ్ల

చౌకబియ్యం దుర్వినయోగం అరికడతామన్న మంత్రి

విజయవాడ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): ఏపీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని మంత్రి నాదెండంల మనోహర్ సోమవారం ప్రారంభించారు. విజయవాడ వరలక్ష్మీనగర్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్ లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చౌకబియ్యం దుర్వినియోగం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు- తెలిపారు. సాంకేతికత వినియోగంతో స్మార్ట్ రేషన్‌కార్డులు తయారు చేశాం. వీటిలో క్యూఆర్ కోడ్ పొందుపరిచాం. రేషన్ తీసుకోగానే కేంద్ర, జిల్లా కార్యాలయాలకు సమాచారం అందుతుంది. 9 జిల్లాల్లో ఇవాళ ఇంటింటికీ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నాం. 1.46 కోట్ల కుటుంబాలకు సెప్టెంబర్ 15 కల్లా కార్డులు అందిస్తాం అని అన్నారు. కొత్తవారికి, చిరునామా మార్చిన వారికి కూడా పంపిణీ చేస్తాం. భవిష్యత్తులో రేషన్ దుకాణాల ద్వారా గోధుమలూ అందజేస్తాం. డీలర్ల వద్ద ఉన్న ఈ-పోస్ యంత్రాలను ఆధునీకరిస్తున్నాం. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 29,797 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ప్రజల అవసరాల దృష్ట్యా వీటి సంఖ్య పెంచాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో సబ్ డిపోల ఏర్పాటు-కు కార్యాచరణ తయారు చేస్తున్నాం అని నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# యూరియా కష్టాలు.. పంపిణీ కేంద్రాల వద్ద రైతుల బారులు

## కొనసాగుతున్న యూరియ పడిగాపులు



నల్గొండ: ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. గత పక్షం రోజులుగా ఇదే పరిస్తితి ఉంది. దీంతో రైతులు మండిపడుతున్నారు. పంపిణీ కేంద్రాల వద్ద తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. త్రిపురాంతకం, శాలిగౌరారం పీఏసీఎస్‌ల వద్ద క్యూలైన్లలో ఆధార్ కార్డులు, చెప్పులుపెట్టి నిరీక్షిస్తున్నారు. మరోవైపు సూర్యాపేట జిల్లా అనంతగిరిలో ఉదయం 5 గంటల నుంచే రైతులు క్యూ కట్టారు. పలు కేంద్రాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు పహారా కాస్తున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రతి రైతుకూ యూరియా బస్తాలు అందేలా చర్యలు చేపడుతున్నారు.

# పురోహితుడిని మోసం చేసిన సైబర్ నేరగాళ్లు



హైదరాబాద్: సైబర్ నేరాలపై ఎంత అవగాహన కల్పిస్తున్న ఎవరో ఒకరు ఆ ఉచ్చులో చిక్కుకుంటూనే ఉన్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో బ్యాంకింగ్‌కి సంబంధించిన వివరాలను వెల్లడించవద్దని పదే పదే చెబుతున్నా.. ఆ మాట పెడచెవిన పెట్టి సైబర్ నేరగాళ్ల కాటుకు బలి అవుతున్నారు. తాజాగా నగరానికి చెందిన ఓ పురోహితుడికి సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. పాతబస్తీ పురానాపూల్‌కి చెందిన పురోహితుడిని పూజ పేరుతో కేటుగాళ్లు రూ.6 లక్షలు కాజేశారు. సికింద్రాబాద్ మిలిటరీ కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నామని.. కల్నల్ సర్ ఆరోగ్యం బాగోలేదని చెప్పారు. 11 రోజుల పూజ కోసం 21 మంది పురోహితులు కావాలని నమ్మబలికారు. అడ్వాన్స్ కింద మూడు లక్షలు చెల్లిస్తామని కూడా చెప్పారు. తొలుత రూ.10 పంపి.. ఆ తర్వాత వీడియో కాల్ చేసి మిగితా డబ్బు పంపిస్తామని కార్డు, పిన్ వివరాలు తెలుసుకున్నారు. దాంతో విడతల వారిగా రూ.5.99 లక్షలు నేరగాళ్లుకాజేశారు. మోసపోయినట్లు- గ్రహించిన బాధితుడు 1930కు కాల్ చేసి జరిగింది చెప్పాడు. దీనిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# దర్యాప్తునకు సహకరించండి

## ప్రభాకర్ రావుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరిగింది. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. దర్యాప్తునకు సహకరించాలని ప్రభాకర్‌రావును ఆదేశించింది. ప్రభాకర్ రావు దర్యాప్తునకు ఏమాత్రం సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేసు దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సాక్ష్యాధారాలు టాంపరింగ్ చేశారని సిద్ధార్థ లూథ్రా అన్నారు. డేటా రికవరీ చేయడానికి కూడా సహకరించడం లేదని చెప్పారు. తాను స్వయంగా వచ్చి కేసు వివరాలు అన్నీ చెప్తానని ఆయన కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అప్పటివరకు పాస్ ఓవర్ ఇవ్వాలని కోరారు. ప్రభాకర్ రావు ఇచ్చిన ఎలక్ట్రానిక్ పరికరాలు అన్ని ఫార్మాట్ చేసి ఇచ్చారని సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ల్యాప్‌ట్యాప్ కూడా అదే స్థితిలో ఉందని, దానిలో కూడా ఎలాంటి డేటా లేకుండా చేశారని తుషార్ మెహతా అన్నారు. ప్రభాకర్‌రావు దర్యాప్తునకు సహకరించడం లేదని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే ఎన్నిసార్లు పిలిచినా దర్యాప్తునకు హాజరవుతున్నట్లు- ప్రభాకర్‌రావు తరఫు న్యాయవాది శేషాద్రి నాయుడు తెలిపారు.

# ఓటరుతో ఆధార్ నమోదు చేయాలి

## బోగస్ ఓట్ల ఏరివేత పక్కాగా సాగాలి

న్యూఢిల్లీ: ఓటర్‌ను ఆధార్‌తో నమోదు చేయించే ప్రక్రియ జరక్కపోవడం, దానిని తప్పనిసరి చేయక పోవడంతో ఓటర్ల జాబితా ఎప్పుడూ గందరగోళానికి, విమర్శలకు గురవుతోంది. బీహార్ వ్యవహారంలో ఇది విమర్శలకు దారితీసింది. ఓట్ల నమోదు, తొలగింపు ప్రక్రియ అభిసు పాలయ్యింది. చివరకు సుప్రీం జోక్యం చేసుకునే పరిస్తితి వచ్చింది. విపక్షాలు ఆందోళనతో పార్లమెంట్‌ను స్తంభించ చేశాయి. ఈ క్రమంలో పక్కా ఓటరు నమోదు ప్రక్రియ అన్నది సవాల్‌గా తీసుకోవాలి. గతంలో ప్రతి ఒక్కరి ఫోన్‌లకు ఆధార్ నమోదు కోసం మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ఓటరు కార్డుతో ఆధార్ నమోదు ద్వారా బోగస్ ఓట్లను అరికట్టాలని అధికారులు నిర్ణయించారు. ఒక వ్యక్తి ఒకే ఓటు హక్కు ఉండాలనేది ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు ఆధార్ నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించినా అది ముందుకు సాగలేదు. ఓటరు జాబితాను పక్కాగా రూపొందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపినా, బీహారల్‌లో విమర్శల పాలయ్యింది. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ సాఫ్ట్‌వేర్ ద్వారా డబుల్ ఓట్లు కలిగిన వారిని గుర్తించి జాబితాను రూపొందించవచ్చు. జాబితా సిద్ధం కాగానే జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చి వాటిని తొలగించేయాలి. ఇలా ప్రతి జిల్లాలో చర్యలు చేపట్టడం ముఖ్యం. దేశం యావత్తూ ఓట్ల నమోదు,ఆధార్ అనుసంధాన ప్రక్రియ కొనసాగితే పంచాయితీ ఉండదు. చాలామంది నివాసాలు మారడంతో రెండు, అంతకుమించి చోట్ల ఓటుహక్కు ఉంటోంది. కొంతమంది పిల్లల చదువు, ఉద్యోగరిత్యా పట్టణాల్లో నివాసం ఉంటున్నారు. సొంత గ్రామాల్లో ఓటు హక్కుతో పాటు నివాసం ఉంటున్నచోట సైతం వీరు ఓటు హక్కు వినియోగంచు కుంటున్నారు. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటు మున్సిపాల్టీ ఎన్నికల్లో సైతం ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఇలాంటి వాటిని నివారించడానికి ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టాలి. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ సాఫ్ట్‌వేర్‌తో ఇటువంటి వాటికి చెక్ పెట్టే అవశం ఉంది. రెండు చోట్ల ఒకే ముఖ కవలికలు ఉంటే కొత్తగా వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులు వీరిని గుర్తించవచ్చన్నారు. ఇలా రెండుచోట్ల ఓటుహక్కు ఉన్న వారందరినీ గ్రామాలు, వార్డుల వారీగా గుర్తించవచ్చు.

ఇలా రెండేసి ఓటరు జాబితాలో ఉన్న వారిని ఒక చోట ఓటు హక్కు తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలి. అలాగే ఇతరరాష్టాల్లోక్రూడా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎలాంటి అవకాశం లేకుండా అధికారులు పక్కాగా చర్యలు తీసుకోవాలి. ఓటరుకార్డు ఉన్న వారు ఫారం-6లో పూర్తి వివరాలు నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేస్తే వాటిని క్రోడీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. నమోదు చేసిన వెంటనే ఓటరు ఫోన్‌కు మెసేజ్ వస్తుంది.

# అంబేద్కర్ భవనం, జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటుకై కదం తొక్కిన దళితులు

## భారీగా దళితుల ఐక్యత ప్రదర్శన

## మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన దళిత నేతలు

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు. ఆగస్టు 25 సోమవారం**



ఎమ్మిగనూరు పట్టణంలో.. దళితుల కోసం ప్రభుత్వం కేటాయించిన భూమిలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ. రెండు కోట్లు నిధులు మంజూరు చేయాలని, అలాగే ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం నెంబర్: 153/2012 ఆమోదం మేరకు రిక్రియేషన్ క్లబ్ ఎదురుగా డివైడర్ నందు భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం పార్టీలకతీతంగా దళిత,బహుజనులు, దళిత ప్రజా సంఘాల నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఐక్యత ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా ఎంపీడీవో కార్యాలయం నుండి బయలుదేరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సోమప్ప సర్కిల్, వైయస్సార్ సర్కిల్ మీదుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని దళిత, బహుజనులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కి అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు యస్. దేవ సహాయం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదె న్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జి. ఆనంద్ చైతన్య మాదిగ, మాల మహానాడు నాయకులు మాజీ కౌన్సిలర్ కోరిశెట్టి మధుబాబు,బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు సంకుల మహాలింగప్ప లు మాట్లాడుతూ... డా.బి.ఆర్. అంబేద్కర్ భవనంనకు కేటాయించిన స్థలంలో మున్సిపల్ స్థలంగా బోర్డు వేయడం సరికాదన్నారు. జగ్జీవన్ రామ్ విగ్రహ నిర్మాణం కోసం మున్సిపల్ తీర్మానం ఆమోదించి జిల్లా కలెక్టర్ కు పంపి 13 ఏళ్లు గడుస్తున్నా... విగ్రహం ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. కలుగొట్ల రోడ్డులో విస్తరించిన జగ్జీవన్ రామ్ కాలనీకి ముఖద్వారం ("ఆర్చి") నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు మంజూరు చేస్తూ.. 2020లో స్పెషల్ ఆఫీసర్ కౌన్సిల్ ఆమోదం తెలిపిన ప్పటికి ఐదేళ్లు గడుస్తున్నా... జాప్యం చేయడం ముమ్మాటికి వివక్షతేనన్నారు. దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరి ట ఎమ్మిగనూరు పట్టణంలో సంజీవయ్య నగర్ గా రూపుదిద్దుకున్నప్పటికీ ఇంతవరకు బోర్డు ఏర్పాటు చేయలేదని ఆవేదన చెందారు. దళితుల న్యాయమైన సమస్యలపై స్థానిక శాసనసభ్యులు డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర రెడ్డి తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అంబేద్కర్ భవనానికి రెండు కోట్లు నిధులు కేటాయింపు, జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

# జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సంతకాల సేకరణ

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



కర్నూలు సిటీ ఆగస్టు 25 సోమవారం
శ్రీ దామోదరం సంజీవయ్య గారి పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలని కర్నూలు జిల్లా కలెక్టరేట్ ముందు ఉన్న గాంధీ విగ్రహం దగ్గర సంతకాల సేకరణ చేసి, జిల్లా కలెక్టర్ గారికి దామోదరం సంజీవయ్య జిల్లా సాధన సమితి తరపున వినతి పత్రం అందజేసినట్టు సంజీవయ్య జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షులు నక్కల మిట్ట శ్రీనివాసులు తెలిపారు.
సంజీవయ్య గారి పేరును కర్నూలు జిల్లాకు పెట్టాల్సిన ఆవశ్యత గురించి దామోదరం సంజీవయ్య జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి దాసరి రామ శేషయ్య, కన్వీనర్ కృష్ణయ్య, గౌరవ సలహాదార దామోదరం రాధాకృష్ణ మూర్తి, సమితి నాయకులు నాగభూషణం,సి. వి. వర్మ, రోషన్ ఆలీ, అజయ్ కుమార్,తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతుల శేఖర్ తదితరులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం లో మల్లికార్జున, గోవర్ధన్, రామయ్య, కేధర్, శీనన్న, గిరి, హరి, సత్యనారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పాముల భయంతో చేనేత కార్మికుల జీవన పోరాటం జలమయమైన వీధులు పట్టించుకోని పాలకులు సిపిఎం సర్వే తక్షణమే చేనేత కార్మికుల వార్డు అభివృద్ధికి పది కోట్లు కేటాయించాలని సిపిఎం డిమాండ్

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు ఆగస్టు 25 సోమవారం శివన్న నగర్ ప్రాంతంలో అత్యధిక శాతం చేనేత కార్మికులు మగ్గం పైనే జీవనం సాగిస్తున్నారని ఇటువంటి ప్రాంతంలో మగ్గాలు లోపలికి బయట వర్షపు నీరు మురికి నీరు వల్ల చేనేత కార్మికులు పాములు బెడద ఎక్కువైందని రోడ్లు డ్రైనేజీలు వీధిలైట్లు మిగతా మౌలిక సమస్యల పరిష్కారం కొరకు 10 కోట్ల రూపాయలు చేనేత వార్డుల అభివృద్ధికి కేటాయించాలని సిపిఎం పార్టీ పట్టణ నాయకులు బి రాముడు కే కృష్ణ డిమాండ్ చేశారు చేనేత వార్డు ప్రజలు అభివృద్ధికి నోచుకోలేదని నిరంతరం వర్షపు నీరు కి మురికి నీరు కి ఇళ్లలోకి రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చేనేత ఉపాధి లేకపోవడం ఇక్కడ వర్షపు నీరు నిలువ వల్ల అంటు వ్యాధులు మలేరియా డెంగు వ్యాధులు అధికమయ్యాయి నీ తెలిపారు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సర్వే చేయడం జరిగింది వర్షాకాలం వల్ల చేనేతలకు గడ్డు కాలమైందని దాదాపు భూమి మట్టం రెండు అడుగుల మీరు ఉన్నాయని వీటిని తొలగించడానికి సచివాల అధికారులు కానీ మున్సిపల్ అధికారులు కానీ ఏ మాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తపరిచారు ఒకపక్క స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పేరుతో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారని కానీ చైత్ర స్థాయిలో కట్టుకోవడానికి బట్ట నేతన్నలకు సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని అన్నారు శివన్న గారు చివరి వీధి మెయిన్ రోడ్ లో 11:47 బార్ ఎల్ ఎల్ లైన్ అద్వానా జీవనం గడుపుతున్నారని పాములు బెడద తీవ్రంగా ఉన్నారని కనీసం మున్సిపల్ వీధిలైట్లు కూడా లేకుండా జీవనం చేస్తున్నారని ఇటీవల కాలంలో స్వాతంత్రం 79 వ సంవత్సరం సంబరాలు చేసుకున్నప్పటికీ అదేవిధంగా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం కలెక్టర్ ఎమ్మెల్యే ఎంతో అట్టహాసంగా సంబరాలు జరుపుకున్నారని కానీ ఎమ్మిగనూరు చేనేతపురిలో శివన్న నగర్ వీధులంతా వర్షపు నీరుతో మురికి నీరుతో వీటివల్ల పాములు భయం వల్ల పాలకులు చేనేత కార్మికులను విముక్తి చేయాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు నాగరాజు భాగ్యమ్మ జయమ్మ గణేష్ కనికే కృష్ణ శ్రీనివాసులు మల్లారెడ్డి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

# తిరుమలలో శాస్త్రోక్తంగా శ్రీ వరాహస్వామి జయంతి

**తిరుమల,ఉత్తేజిత ప్రతినిధి, ఆగస్టు 25.**



ఆదివరాహక్షేత్రమైన తిరుమలలోని శ్రీ భూ వరాహస్వామివారి ఆలయంలో సోమవారం ఉదయం వరాహ జయంతి శాస్త్రోక్తంగా జరిగింది.ఇందులో భాగంగా ఉదయం కలశస్థాపన, కలశ పూజ, పుణ్యాహవచనం చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ మూలవర్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆగస్టు 29 నుండి 31వ తేదీ వరకు శ్రీ అగస్తీశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు



**తిరుపతి ,ఉత్తేజిత ప్రతినిధి ఆగస్టు 25**

. నారాయణవనంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామివారి ఆలయంలో ఆగస్టు 29 నుండి 31వ తేదీల్లో పవిత్రోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఇందుకోసం ఆగస్టు 29వ తేదీ సాయంత్రం విఘ్నేశ్వర స్వామివారి పూజ, యాగశాల పూజ, అంకురార్పణ నిర్వహిస్తారు. ఇందులోభాగంగా ఆగస్టు 30న ఉదయం యాగశాల పూజ, పూర్ణాహుతి, సాయంత్రం యాగశాలలో పవిత్రోత్సవాలకు పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అదేవిధంగా ఆగస్టు 31న ఉదయం పూర్ణాహుతి, పట్టుపవిత్రాల సమర్పణ నిర్వహిస్తారు.

**ఆలయ ప్రాశస్త్యం :**

ఆలయ చరిత్రను పరిశీలిస్తే నారాయణవనం ప్రాంతాన్ని పరిపాలించిన శ్రీ పద్మావతీదేవి తండ్రి అయిన శ్రీ ఆకాశ మహారాజు పితామహులు ఈ ఆలయాన్ని నిర్మించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఇక్కడ శ్రీ అగస్తీశ్వరస్వామివారు స్వయంభువుగా వెలిశారు. స్వామివారి లింగాకారానికి పీఠభాగం అనగా పానవట్టాన్ని అమర్చి వేద ఆగమశాస్త్ర ప్రకారం శ్రీ అగస్త్య మహర్షులవారు ప్రతిష్ఠ చేసి పూజించినందువల్ల స్వామివారికి అగస్తీశ్వరస్వామి అని పేరు వచ్చింది.

**శ్రీ పరాశరేశ్వరస్వామివారి ఆలయంలో శ్రా**

నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ పరాశరేశ్వరస్వామి వారి ఆలయంలో సెప్టెంబరు 4 నుండి 6వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఇందులోభాగంగా సెప్టెంబరు 4న సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. సెప్టెంబరు 5న యాగశాలలో పవిత్రమాలలకు పూజలు, రక్షాబంధనం నిర్వహిస్తారు. అదేవిధంగా సెప్టెంబరు 6న ఉదయం మహా పూర్ణాహుతి, యాగశాలపూజ, పట్టుపవిత్రాలను స్వామి, అమ్మవార్లు, పరివార దేవతలకు సమర్పిస్తారు.

# ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనివ్వండి.

**టిడిఆర్ బాండ్లు అర్హులైన వారికి ఇస్తున్నాం.**

**గ్రామాలనుంచి వచ్చే ఆదాయం గ్రామాభివృద్ధికే ఖర్చు చేయాలి.**

**శెట్టిపల్లి భూముల సమస్య త్వరలో పరిస్కారం...**

**ఆదాయం పెంపుదలకు కొత్త లే అవుట్స్ ఏర్పాటు..**

**పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ.**



**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,ఆగస్టు 25 :**

ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం ఉదయం తుడా కార్యాలయంలో నగరపాలక సంస్థ ,తుడా అధికారులతో అభివృద్ధి పనులు, ప్రజలకు కల్పించాల్సిన వసతులపై మంత్రి నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. తుడా టవర్స్ , ప్లాట్స్ , దుకాణాల పై వచ్చే అదాయ, వ్యయాలపై తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, వి.సి., జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగరపాలక సంస్థ లో పారిశుద్ధ్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కార్మికులకు కల్పించాల్సిన వసతులపై కమిషనర్ ఎన్.మౌర్య వివరించారు. టౌన్ షిప్ లను అభివృద్ధి చేసి తుడా ఆదాయాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. తుడా ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అన్నారు. పక్కా ప్రణాళికతో ముందుకెళ్లి లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించే నివేదికలను ఇవ్వకుండా వాస్తవాలను వివరించి, ప్రజల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. నెల్లూరు తరహాలో తిరుపతిలో కూడా రోడ్ల శుభ్రతకు స్వీపింగ్ మిషన్ లను వినియోగించాలని అన్నారు.
ఈ సమావేశంలో రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు కృష్ణా రెడ్డి, శ్యాంసుందర్, ఈ.ఈ.లు రవీంద్ర, తులసి కుమార్, గోమతి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.




# మార్కెట్ నందు జే.యు అగ్రీ సైన్స్ కంపెనీ వారి కొత్త మందులు

**కర్నూలు: ఉత్తేజిత న్యూస్:**



ప్రస్తుత మార్కెట్ నందు జే.యు అగ్రీ సైన్స్ కంపెనీ వారి 4 రకాల కొత్త మందులు అందుబాటులో ఉన్నాయని జే.యు అగ్రీ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు.రైతులు సాగు చేసే పంటలలో పురుగు, దోమ మరియు తెగులు నివారణ కొరకు జే.యు అగ్రి సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు మార్కెట్ నందు నాలుగు రకాల కొత్త మందులను ఆదివారం రోజు విడుదల చేశారు.జిల్లా కేంద్రమైన కర్నూలులోని త్రిగుణ హోటల్ నందు ఆదివారం జరిగిన డీలర్స్ సమావేశం నందు జోనల్ హెడ్ మోహన్ రెడ్డి, ఏజీఎం రాజీవ్ నంది లు నాలుగు కొత్త రకాల మందులను మార్కెట్ లోకి విడుదల చేశారు.వీటిలో అయాక, నిజిస్టు అనే పురుగు మందులను,ట్రిస్టన్ అను దోమ ముందును,అజోలిన్ అనే తెగులు మందులను వారు విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పంట సాగులో పురుగు,దోమ మరియు తెగులు నివారణకు ఈ మందులు ప్రభావితం చేస్తాయని వారు తెలియజేసారు.నేటి నుండి ఈ మందులు మార్కెట్ లో అందుబాటులో ఉంటాయని వారు తెలియజేశారు.రైతులు ఎటువంటి సందేహాలు లేకుండా ఈ మందులను పంట పొలాలలో వినియోగించవచ్చని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మేనేజర్లు రమేష్,సుధాకర్, నాగేశ్వరయ్య,కర్నూలు రీజియన్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజిత దినపత్రిక

# ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించాలి... గిత్త






## వైద్యశాలలో 300 ఎంఏ ఎక్స్ రే విభాగం ప్రారంభం

## డిజిటల్ ఎక్స్ రే ప్లాంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిది**

. ఆగస్టు 25 – పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో నూతనంగా మంజూరు అయిన 300 ఎంఏ డిజిటల్ ఎక్స్ రే ప్లాంట్ కు ప్రత్యేక పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా వైద్యశాల సూపర్డెంట్ రాంబాబు, హెడ్ నర్స్ భువనేశ్వరి ఎమ్మెల్యే పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. వైద్యశాలకు వచ్చిన రోగులతో మాట్లాడుతూ వైద్య సేవలు ఎలా అందిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వ వైద్యశాలలో ఎక్స్ రే లేకపోవడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి ఎక్స్ రే తీయించుకునే పరిస్థితి ఉండేదని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. 300 ఎంఏ డిజిటల్ ఎక్స్ రే ప్లాంట్ విభాగము సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 100 పడకల వైద్యశాలగా మార్చాలని ఇటీవల నియోజవర్గ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి , రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్ , పగిడ్యాల టిడిపి మండల కన్వీనర్ పలుచని మహేశ్వరరెడ్డి , వైద్య సిబ్బంది ,టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని ఉపాధి హామీ సిబ్బంది



**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ ఆగస్టు 25**

సి.బెళగల్ మండలంలోని ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లు సమయపాలన పాటించడం లేదు. సి.బెళగల్ మండల కేంద్రంలో నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. సాధారణంగా ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సి.బెళగల్ మండల కేంద్రంలోని విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా సి.బెలగల్ మండల కేంద్రంలో ఉదయం 11:30 లేదా 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకే విధులు నిర్వహిస్తుంటారు. వీరిపై ఇప్పటికే ఉన్నత స్థాయి అధికారులకు నివేదికలు అందజేసిన మాత్రం ఫలితం మాత్రం రావడం లేదు. ఉపాధి హామీ పనుల నిమిత్తం మండల కేంద్రంలో వచ్చిన ప్రజలు , అధికారులు వస్తారో, లేదు తెలియక అయోమయ పరిస్థితి ఏర్పడింది. సమయపాలన పాటించాలని ఏపీఓ, ఎంపీడీఓ కంప్యూటర్ ఆపరేటర్లను, టెక్నికల్ అసిస్టెంట్లను పలుమార్లు హెచ్చరించిన వీరి పరిస్థితి మాత్రం మారడం లేదని ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

# భూ సమస్యలు పరిష్కరించండి

**సి.బెలగల్ ఉత్తేజిత న్యూస్ ఆగస్టు 25**



కంబదహాల్ గ్రామంలోని భూ సమస్యలు పరిష్కరించాలని సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ తహసిల్దార్ పురుషోత్తముడికి రైతులు వినతిపత్రం అందజేశారు. సోమవారం సి.బెళగల్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు దరఖాస్తులు వచ్చాయని డిప్యూటీ తహసిల్దార్ పురుషోత్తముడు తెలిపారు. కంబదహాల్ గ్రామానికి చెందిన రైతులు భూ విస్తరణ కొలతలలో తేడాలు ఉన్నాయని,గతంలో జరిగిన రీ సర్వేలో కొలతల్లో తేడాలు వచ్చాయని తమ భూములను కొలిచి, విస్తరణ సరి చేయాలని రెండు దరఖాస్తులు వచ్చాయని, బురాన్దొడ్డి గ్రామం నుంచి ఆన్లైన్ సంబంధించిన ఒక దరఖాస్తు వచ్చిందని డిప్యూటీ తహసిల్దార్ పురుషోత్తముడు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రాణెమ్మ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గోనే నాయక్, మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆర్ఐ తరుణ్, ఐడి ఐసిడిఎస్ సూపర్వైజర్ జరీనా భాను, ఎంఈఓ జ్యోతి పాల్గొన్నారు.

## ఉల్లి పంటలను పరిశీలించిన జిల్లా ఉద్యాన అధికారి

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ ఆగస్టు 25**




సి.బెళగల్ మండలం పలుదొడ్డి గ్రామంలోని ఉల్లి పంటలను సోమవారం జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లిగడ్డలను ఎండబెట్టిన తర్వాత వాటిలో తేమశాతం లేకుండా చూడాలని తెలిపారు. ఉల్లిగడ్డలో నాణ్యతను బట్టి ధర ఉంటుందని తెలిపారు. ఉల్లిగడ్డలలో నాణ్యత లోపిస్తే ధర తగ్గే అవకాశం ఉందని తెలిపారు. గతం వారం రోజులుగా కురిసిన వర్షాలకు ఉల్లి పంట కుళ్ళిపోయినట్లయితే పొలంలో కూలిన భాగాన్ని తీసివేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు ఉద్యాన అధికారి మదన్మోహన్, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఆఫ్రీన్, విజయలక్ష్మి, హనీఫ్, ప్రవీణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దారి మళ్లించినా.. ధరలు పెంచినా కేసులే

దుకాణాలు, పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లు, ఆర్ఎస్‌కేలు సహా ఎక్కడా యూరియా కోసం రైతులు పడిగాపులు పడే పరిస్థితి ఉండకూడదు.సరఫరాలో పొరపాట్లు ఉంటే సరిచేసుకోవాలి. యూరియా లభ్యతపై ఎక్కడైనా ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తుంటే తిప్పి కొట్టాలి. అలాంటి వారెవరో పసిగట్టి సరైన రీతిలో సమాధానం చెప్పాలి.



## యూరియా కోసం రైతులెక్కడా ఇబ్బంది పడకూడదు

## ఎరువులపై విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలి

## మార్క్‌ఫెడ్‌కు 70% కేటాయింపులు

## పీఏసీఎస్, ఆర్ఎస్‌కేల్లో సరిపడా నిల్వలుంచాలి: సీఎం చంద్రబాబు

అమరావతి: ఎరువులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని.. విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. 'నల్లబజారుకు ఎరువులు తరలించే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయాలి. ధరలు పెంచి అమ్మేవారిపైనా కేసులు నమోదుచేయాలి. యూరియా కోసం రైతులు ఇబ్బంది పడకూడదు. ఎక్కువగా ఎరువులు విక్రయించే రిటైల్ వ్యాపారుల్లో.. తరచూ కొనుగోలు చేసేవారు ఉన్నట్లు గుర్తిస్తే వారిపై విచారణ చేయండి. యూరియా, ఇతర ఎరువుల నిల్వలు తనిఖీ చేయాలి. వాటి లభ్యతపై రైతులకు పూర్తిస్థాయి సమాచారాన్ని అందుబాటులో ఉంచాలి' అని స్పష్టంచేశారు. ఎరువుల లభ్యత, సరఫరాపై ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో పాటు వ్యవసాయశాఖ, విజిలెన్స్ విభాగాల అధికారులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఎరువుల సరఫరాపై ఆయన ఆరా తీశారు. అవసరానికి తగినంత యూరియా అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. వ్యవసాయేతర అవసరాలకు యూరియా తరలించకుండా కట్టడి చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. 'ప్రైవేటు వ్యాపారులకు కేటాయింపులు తగ్గించాలి. 70% ఎరువులను మార్క్‌ఫెడ్‌కే ఇవ్వాలి. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్), రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) ద్వారా రైతులకు ఎరువుల్ని అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలి. అక్కడ సరిపడా నిల్వలు ఉంచాలి. రైతులు ఎక్కడా యూరియా కోసం ఇబ్బందులు పడకూడదు' అని అన్నారు. 'స్థానిక అధికారులతో.. జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలి. పరిశ్రమలు, రవాణా, విజిలెన్స్, పోలీసు, వ్యవసాయ అధికారులు, జిల్లా కలెక్టర్ల సమన్వయంతో రోజువారీ పరిశీలన జరగాలి. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కడైనా సమస్య వస్తే స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలి' అని ఆదేశించారు. ఎరువుల సరఫరా, నిల్వల పోర్టల్‌పైనా ఈ సందర్భంగా సీఎం ఆరా తీశారు. 'రియల్ టైమ్ ప్రాతిపదికన ఐఎంఎఫ్ఎస్ పోర్టల్‌లో ఎరువుల అమ్మకాల సమాచారం అప్‌డేట్ కావడం లేదు. సాకులు చెప్పకుండా నిరంతరం ఈ సమాచారాన్ని అప్‌డేట్ చేయాలి. ఎరువుల వాడకంపై రైతుల్లో అవగాహన పెంచాలి' అని ఆదేశించారు.

## వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి



**బేతంచర్ల : ఉత్తేజిత ప్రతినిధి**

: నెల 27వ తేదీన వినాయక చవితి పర్వదినాన్ని విగ్రహాలు ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డిఎస్పి శ్రీనివాసులు,సీఐ వెంకటేశ్వరరావు,ఎస్సై రమేష్ బాబు,ఎంపీడీవో పజిల్ రహమాన్,కమిషనర్ హరి ప్రసాద్,లు సూచించారు. సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఉత్సవాల నిర్వాహకులు వినాయక కేంద్ర కమిటీ సభ్యులు ముస్లిం పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ,సీఐ,ఎంపిడిఓ కమిషనర్ ఎస్సైలు,మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా విగ్రహాలన్నీ ఏర్పాటు చేసుకోవాలని విగ్రహాల దగ్గర ఎలాంటి విద్యుత్ సమస్య లేకుండా అలాగే విగ్రహాల దగ్గర రాత్రి 10 గంటల వరకే సౌండ్ బాక్స్ లు వినియోగించుకోవాలని నిమజ్జనం రోజున డీజేలు నిషేధించడమైందన్నారు. అలాగే సంస్కృత కార్యక్రమా నిర్వహించుకోవాలని వారన్నారు. విగ్రహాల నిర్వాహకులు అధికారులకు పోలీసులకు సహకరించాలని అన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలోఎస్సై కేసి తిరుపాలు,గౌరు హుస్సేన్ రెడ్డి,మండల కాజీ నూర్ అహ్మద్, విగ్రహాల నిర్వహకులు ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అరుణ ఫోన్లలో అసలు గుట్టు!




అమరావతి :నెల్లూరుకు చెందిన లేడీ డాన్ అరుణ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోన్లలో కొంతమంది ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధుల ఆడియో, వీడియో రికార్డులతో పాటు వందలకొద్దీ ఫొటోలు ఉండి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. ప్రధానంగా వైకాపా హయాంలో నెల్లూరు జిల్లాలో పనిచేసిన ఓ ఐపీఎస్ అధికారితో ఉన్న ఫొటోలు, వీడియోలు ఆ ఫోన్లో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కస్టడీకి తీసుకున్నప్పుడు ఆమెతోనే ఈ ఫోన్‌లను తెరిపించి వాటిలోని సమాచారాన్ని వెలికితీయాలని నిర్ణయించారు. అరుణను అరెస్టు చేసినప్పుడు ఆమెవద్ద నుంచి రెండు ఖరీదైన మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కోర్టు అనుమతి తీసుకుని వాటిని తెరిపించాలని పోలీసులు నిర్ణయించారు. దీంతో ఆమెతో సన్నిహిత సంబంధాలు కొనసాగించినవారిలో ఆందోళన మొదలైంది. వాటిలో ఎవరెవరి ఫొటోలు, వీడియోలు, ఆడియోలు ఉన్నాయి? ఎవరి గుట్టు బయటపడుతుందనేవి చర్చనీయాంశంగా మారాయి.

### ఆమె అలవాటే.. వారిని పట్టిస్తుందా?

అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతస్థాయి వ్యక్తులతో ఫోన్‌లలో మాట్లాడినప్పుడు వాయిస్ రికార్డు చేయటం, వారితో సన్నిహితంగా ఉన్నప్పుడు ఫొటోలు, వీడియోలు తీసుకోవటం అరుణకు అలవాటు. తియ్యని మాటలతో వారిని ఉచ్చులోకి దించటం.. తర్వాత అనుకున్న పనులు చేయించుకోవటం ఆమె అనుసరించిన నేరవిధానం. తనకు సహకరించకపోతే.. వారితో సన్నిహితంగా ఉన్నప్పుడు, వివిధ ప్రాంతాలకు ట్రిప్పులకు వెళ్లినప్పుడు తీసిన వీడియోలు, ఫొటోలు బయటపెడతానని బెదిరించేది. అప్పటికీ దారికి రాకపోతే వాటిని చూపి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేది. ఓ అదనపు ఎస్పీ, ఓ జైలు అధికారిపైనా ఇలాగే ఫిర్యాదులు చేసింది.

# ధర్మస్థల వ్యవహారం అంతా ఉత్తిదే

### అబద్ధాలతో బురిడీ కొట్టించిన ముసుగు వ్యక్తి

### తవ్వకాలతో పోలీసులను పరుగెత్తించిన భీమా

### అబద్ధమనిచెప్పడంతో అరెస్ట్ చేసిన సిట్



బెంగళూరు: ధర్మస్థల వ్యవహారం అంతా తూచ్ .. అన్నట్లుగా తయరయ్యింది. కర్ణాటకలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థల సామూహిక మృతదేహాలు ఖననం కేసు కీలక మలుపు తిరిగింది. వందలాది మృతదేహాలను స్వయంగా తన చేత్తోనే ఖననం చేశానని ఫిర్యాదు చేసిన మాస్క్ మ్యాన్ భీమా అసలు రంగు బయటపడింది. పారిశుద్ధ్య కార్మికుడు ఇన్నాళ్లూ చేసిన ఆరోపణలు బూటకమేనని సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదోవ పట్టించిన మాస్క్ మ్యాన్‌ను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ధర్మస్థల ఆలయ పరిసరాల్లో సుమారు 100కు పైగా మృతదేహాలను ఖననం చేశానంటూ భీమా 15 రోజులుగా ఆడుతున్న నాటకానికి సిట్ బృందం తెరదించింది. మాయమాటలతో వ్యవస్థను నమ్మించి విచారణలో పదేపదే తన వాదనలు మార్చిన భీమా చివరకి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడు. దీంతో ప్రణబ్ మహంతి నేతృత్వంలోని సిట్ బృందం పారిశుద్ధ్య కార్మికుడు భీమాను అదుపులోకి తీసుకుంది. ఇంత డ్రామా ఆడటానికి కారణాలేంటని రాబట్టేందుకు సిట్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. విచారణ అనంతరం భీమాను కోర్టులో హాజరు పరచనున్నారు. ఈ కేసులో మరో కీలక వ్యక్తి అయిన బెంగళూరుకు చెందిన సుజాత భట్‌పైనా విచారణ కొనసాగుతోంది. ఆమె, తన కుమార్తె అనన్య భట్ 2003లో ధర్మస్థలలో అదృశ్యమైందని ఫిర్యాదు చేసింది. కానీ, తాజాగా ఆమె ఆ ఆరోపణలను తిరస్కరించింది. దీంతో సుజాతను కూడా పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ధర్మస్థల శైవ క్షేత్రంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసిన భీమా అనే వ్యక్తి కొన్నాళ్ల క్రితం సంచలన ఆరోపణలు చేశాడు. 1995 నుండి 2014 మధ్య లైంగిక వేధింపులకు గురై హత్య చేయబడ్డ 100కు పైగా మహిళలు, పిల్లల మృతదేహాలను తాను పూడ్చిపెట్టానని.. 2014లో తమ కుటుంబంలోని ఓ యువతిని లైంగికంగా వేధించి హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడం దేశ వ్యాప్తంగా కలకలం చెలరేగింది. పశ్చాతాపం వెంటాడుతుండటంతోనే ఈ ఫిర్యాదు చేసినట్లు- భీమా వివరణ ఇచ్చుకున్నాడు. దీంతో ప్రభుత్వం దర్యాప్తు కోసం ప్రణబ్ మహంతి నేతృత్వంలోని సిట్ బృందాన్ని రంగంలోకి దింపింది. భీమా చెప్పిన ప్రకారం పలు చోట్ల సిట్ అధికారులు తవ్వకాలు జరిపారు. కేవలం రెండు ప్రదేశాల్లోనే కొన్ని ఎముకలు కనిపించాయి. స్పష్టమైన ఆధారాలు లభించకపోవడంతో సిట్ అధికారులకు ఫిర్యాదుదారుడైన భీమా ఆరోపణలపై అనుమానం రేకెత్తింది. దీంతో లోతుగా దర్యాప్తు నిర్వహించగా ఆశ్చర్యకరమైన నిజాలు వెల్లడయ్యాయి. విచారణలో భీమా కూడా మాట మార్చాడు. వేరెవరో ఒక పుర్రె ఇచ్చి పోలీసులకు ఇమ్మన్నారని.. కోర్టులో పిటిషన్ కూడా వారే వేయించారని.. నేను 2014 నుంచి తమిళనాడులోనే ఉన్నానని అతడు పేర్కొనడంతో సిట్ అధికారులకు దిమ్మతిరిగి పోయింది. దీంతో ఇదంతా డ్రామాగా గుర్తించి భీమాను అరెస్టు చేశారు. అతడు అబద్ధాలు చెప్పి, ప్రజలను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఇప్పటికే అతడు మాట మార్చిన సంగతి తెలిసిందే. తప్పుడు సమాచారంతో ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదారి పట్టించాడన్న అభియోగాలపై భీమాను ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిన్న రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సిట్ ప్రధాన అధికారి ప్రణబ్ మొహంతీ అతడిని విచారించారు. మాయమాటలతో మొత్తం వ్యవస్థను నమ్మించి చివరికి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడని ఈ దర్యాప్తులో విచారణ బృందం గుర్తించింది. దీంతో అతడిని అరెస్టు చేసింది. దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం. కర్ణాటక ప్రజలతో పాటు- పొరుగు రాష్ట్రాల నుంచీ ఇక్కడికి భారీగా వస్తుంటారు. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేయడంతో దేశమంతా ఉలిక్కిపడింది. ఇకపోతే ధర్మస్థల పుణ్యక్షేత్రంపై అనవసర ఆరోఫలు చేయడం తగదని బీజేపీ నాయకులు శుక్రవారం నగరంలో ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ఒక మతిస్థిమితం లేని వ్యక్తి, అదీ ఎవరోడబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తుల మాటల ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు- చేయడం సిగ్గుచేటని సీఎంపై నిప్పులు చెరిగారు. హిందుత్వాన్ని దెబ్బతీసే విధంగా కొందరు వ్యక్తులు కావాలనే ధర్మస్థలపై నిందలు వేశారని అన్నారు.



# మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

## ఎటక్ట్రిక్ వాహనాలకు టోల్ మినహాయింపు

ముంబై: మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్‌ప్లాజాలలో టోల్ మినహాయింపు కల్పిస్తున్నట్లు ప్రకటన చేసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కాలుష్యం తగ్గించడంతో పాటు ఎలక్ట్రిక్ వాహనాల కొనగోలును ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో పెరుగుతన్న కాలుష్యం దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వం కాలుష్యం తగ్గించే దిశగా చర్యలు మొదలుపెట్టింది. ఈ మేరకు ఎలాక్ట్రిక్ వాహనాలకు టోల్ మినాహాయింపు ప్రకటించింది. ఎలాక్ట్రిక్ కార్లు, బైకులకు టోల్ ఫ్రీ చేస్తూ..నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రజలు ఎలాక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయడానికి మొగ్గుచూపుతారని ప్రభుత్వం అభిప్రాయం వ్యక్తం చేస్తుంది. దీనితో పాటు- రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న ఎలాక్ట్రిక్ వాహనాల కంపెనీలు ఏర్పాడుతాయని భావిస్తుంది. గతంలో ఢిల్లీలో వాహన కాలుష్యంతో ఏర్పడిన పరిణామాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలోనూ వాహన కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం టోల్ ట్యాక్స్‌లను రద్దు చేస్తున్నట్లు- ప్రకటించింది.

# ప్రధాని మోడీపై తేజస్వీ అభ్యంతరకర పోస్ట్

## మహారాష్ట్ర, యూపిల్లో కేసులు నమోదు



న్యూఢిల్లీ:బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌పై మహారాష్ట్రలోని గడ్చిరోలీ జిల్లాలో కేసు నమోదైంది. ప్రధాని మోదీపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టారంటూ స్థానిక ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. గడ్చిరోలీ ఎమ్మెల్యే మిలింద్ నరోటే ఫిర్యాదు చేసినట్టు- సీనియర్ పోలీసు అధికారి ఒకరు పేర్కొన్నారు. ప్రధాని బిహార్ పర్యటన నేపథ్యంలో తేజస్వి యాదవ్ అభ్యంతరకర పోస్టు పెట్టారని నరోటే ఫిర్యాదు చేసినట్టు- తెలిపారు. ఎమ్మెల్యే నరోటే ఫిర్యాదు మేరకు పోలీసులు తేజస్వి యాదవ్‌పై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ల మేరకు వర్గాల మధ్య శత్రుత్వాన్ని రెచ్చగొట్టడం, పరువుకు భంగం కలిగించడం, శాంతికి విఘాతం కలిగించే ఉద్దేశంతో అవమానించడం కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే యూపీలో కూడా తేజస్విపై కేసు నమోదైంది. షాజహాన్‌పూర్ బీజేపీ మెట్రోపాలిటన్ అధ్యక్షురాలు శిల్పి గుప్తా ఫిర్యాదు మేరకు ఆయనపై బజార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో తేజస్వి అభ్యంతరకర పోస్టు పెట్టారని శిల్పి గుప్తా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక బిహార్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల పాలనపై మండిపడ్డారు. వారి పాలనను చీకటి యుగంగా అభివర్ణించారు. విద్య, ఉపాధి లేక ఎన్నో తరాలు ఉన్న ఊరిని వదులుకొని పొరుగు ప్రాంతాలకు వలసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిహార్‌ను ఆర్జేడీ కేవలం తన ఓటు- బ్యాంకుగా మార్చుకుందని మండిపడ్డారు యావత్ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని ప్రధాని అన్నారు. ప్రధాని ఆరోపణలపై తేజస్వి ప్రతి విమర్శలు చేశారు. గయాలో ప్రధాని అసత్యాలు పలికారని అన్నారు. ప్రజలు మాత్రం వీటిని నమ్మరని తేల్చి చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వ పాలన వివరాలను కూడా చెప్పాలని సవాలు విసిరారు.





# నిస్వార్థ రాజకీయ నేత సురవరం !

రాజకీయాల్లో స్వార్థపరులేే తప్ప నిస్వార్థపరులు ఉండరు... అన్న కాలంలో నేనున్నానని చెప్పుకునే ఉదాత్త లక్షణాలు కలిగిన నేత సురవరం సుధాకర్ రెడ్డి. ఆజన్మాంతం సామాన్యుడిగా ఉంటూ..అసామాన్య రాజకీయ ప్రతిభను ప్రదర్శించిన వ్యక్తి సురవరం. ఆయన తెలుగువాడు కావడం మనమంతా గర్వించాలి. కమ్యూనిస్టు రాజకీయాల్లో ఉంటూనే దేశ రాజకీయాల్లో ప్రభావశీలమైన పాత్రపోషించారు. కమ్యూనిస్టులు ఏకం కావాలన్న ఆయన కోరిక మాత్రం తీరకుండానే పోయారు. పుట్టినవారు గిట్టక మానరు...అయితే జీవించినంత కాలం ఏం సాధించామన్నది ముఖ్యం. అదే సురవరంలో మనం చూస్తాం. ఎప్పుడూ ప్రజల గొడవతోనే ఆయన జీవితం ముడిపడి ఉండేది. తెలంగాన కమ్యూనిస్టు దిగ్గజాలలో గతేడాది సీతారాం ఏచూరిని కోల్పోయాం. ఏడాదిలోపే ఇప్పుడు సురవరంను కోల్పోయాం. జాతీయ రాజకీయాల్లో తెలుగువారు కనుమరుగు అవుతున్నారు. గట్టిగా నిలబడే నేతలు లేకుండా పోతున్నారు. ఈ క్రమంలో సురవం వృద్ధాప్య కారణాలతో మనలను వీడిపోయారు. ఆయన రాజకీయాల్లో అజాతశత్రువు... అంతకు మించి నిస్వార్థ రాజకీయ నేత. పీడిత,తాడిత వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన తెలంగాణ ముద్దుబిడ్డ... చెప్పాలంటే అరుదైన మట్టిమనిషి. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శిగా సురవరం సుధాకర్ రెడ్డి తనవంతుగా దేశానికి ఋషిలా పనిచేశారు. సమస్యలు ఎక్కడున్నా వాటికోసం పోరాడేందుకు ఎప్పుడూ ముందుండే వారు. సమస్యలపై ఎంత గట్టిగా పోరాడేవారో ఆయన అంతకుమంచి సౌమ్యుడు. ఆయన సౌమ్యత్వానికి, పోరాటానికి పొంతన ఉండేది కాదు. కానీ జన్మతః వచ్చిన మృదు స్వభావం కారణంగా ఆయన అజాత శతృవు అయ్యారేమో అనిపిస్తుంది. ఎందుకంటే సురవరం అంటే నచ్చని నేత ఉండేవాడు కాదు. ఆయన మాట్లాడినంత సేపు ఇంకా మాట్లాడాలనిపిస్తుందని అనేవారు. సాదాసీదాగా ఉంటూ జాతీయరాజకీయాల్లో చెలామణి కావడం కష్టం. కానీ అది సాధ్యమని రుజువు చేసిన దిగ్గజనేత సురవం. తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు సురవరం ప్రతాపరెడ్డి తమ్ముడు వెంకటరామిరెడ్డి కుమారుడు సుధాకర్‌రెడ్డి. అందుకేనేమో అటు తండ్రి, ఇటు పెదనాన్న వారసత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్నారు. ఒకవైపు పెదనాన్న సాంస్కృతిక ఉద్యమ ఆదర్శాలను, మరోవైపు తండ్రి స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న సుధాకర్‌రెడ్డి... చిన్నవయసులోనే సమస్యలపై పోరుబాట పట్టిన తీరు అమోఘం. చిరు ప్రాయంలోనే ఆయన మెదడులో నాటుకున్న పోరాటస్ఫూర్తికి అది నిదర్శనంగా చూడాలి. కర్నూలులో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయంలో బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంపై నిరసన చేపట్టారు. అది ఉద్యమంగా రూపుదిద్దుకొని నగరంలోని మిగతా విద్యాలయా లకు వ్యాపించింది. విద్యార్థి దశలోనే సమస్యలపై శంఖారావం పూరించడం యనకు అక్కడితోఏ అబ్బంది.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయి నేతగా సురవరం ఎదిగారు. దివంగత జైపాల్ రెడ్డితో పాటు ఆయన కూడా కమ్యూనిస్టు ఉద్యమంలో రాటుదేలారు. ఎన్నో వామపక్ష ఉద్యమాలు, ఎన్నో ప్రజా పోరాటాల్లో పాలు పంచుకున్నారు. రెండుసార్లు నల్గొండ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన సురవరం సుధాకర్ రెడ్డి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడని చెప్పక తప్పదు. ఆచన చేసిన పోరాటలు,ప్రజా ఉద్యమాల పట్ల ఉన్న నిబద్ధత కారణంగా ప్రజానేతగా సురవరం గొప్ప పేరు సంపాదించుకున్నారు. పీడిత వర్గాల అభ్యున్నతి కోసం జీవితకాలం కృషి చేశారు. తెలంగాణ మట్టి బిడ్డగా, మార్క్సిస్టు ప్రజానేతగా గొప్ప పేరు సంపాదించుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయనది విడదీయరాని అనుబంధం. ఏఐఎస్ఎఫ్ నుంచి ప్రారంభమైన ఆయన ప్రస్థానం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు సాగింది. 2012 నుంచి 2019వరకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పదవిలో కొనసాగారు. మూడు దఫాలుగా ఆయన జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 2000 సంవత్సరంలో విద్యుత్ బిల్లుల పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాలు చేసిన పోరాటంలో సురవరం సుధాకర్ రెడ్డి ముఖ్యపాత్ర పోషించారు. చంద్రరాజేశ్వరరావు తరువాత జాతీయ ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన రెండో తెలుగు వ్యక్తిగా సురవరం నిలిచారు. 1960లో ఏఐఎస్ఎఫ్ కర్నూలు పట్టణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆతర్వాత కర్నూలు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. 1962లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యా లయం కోసం ఏర్పాటు చేసిన సమ్మెకు కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ కమిటీ- 62రోజుల పాటు- చేసిన సమ్మెకు నాయకత్వం వహించారు. అనంతరం కర్నూలులోని కళాశాల విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ చదువుతున్న సమయంలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో కళాశాల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాల అనంతరం ఏఐఎస్ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాధ్యతలను సురవరానికి అప్పగించారు. 1966లో ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి అయ్యారు. దీంతో ఆయన దిల్లీకి మకాం మార్చారు. 1969లో రెండోసారి ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. 1970లో ఏఐఎస్ఎఫ్, 1972లో ఏఐవైఎఫ్‌నకు జాతీయ అధ్యక్షుడయ్యారు. 1971లో కేరళలోని కొచ్చిన్‌లో జరిగిన సీపీఐ 9వ నేషనల్ కౌన్సిల్ సమావేశాల్లో జాతీయ కమిటీ- సభ్యుడయ్యారు. 1974లో తిరిగి ఆంధప్రదేశ్‌కు వచ్చిన సురవరం ఆనాటి నుంచి 1984 వరకు సీపీఐ ఉమ్మడి ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు.

# అమెరికాలో ఘోరరోడ్డు ప్రమాదం

## ఐదుగురు యాత్రికుల దుర్మరణం



న్యూయార్క్:అమెరికాలోని న్యూయార్క్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెంబ్రోక్ శివారులో యాత్రికుల బస్సు బోల్తాపడడంతో ఐదుగురు దుర్మరణం చెందారు. పలువురు గాయపడడంతో హెలికాప్టర్లలో వారిని ఆస్పత్రికి తరలించారు. 50 మంది బస్సులో నయాగారా నుంచి న్యూయార్క్‌కు వెళ్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. ప్రయాణికులు సీటు- బెల్ట్ ధరించకపోవడంతో త్వరగా బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాద్యమాల్లో వైరల్‌గా మారింది. భారత్, చైనా, ఫిలిఫ్పీన్స్‌కు చెందిన యాత్రికులు నయాగారా జలపాతం అందాలను వీక్షించి వస్తుండగా ఈ ప్రమాదం చోటు-చేసుకుంది. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు తొలగించారు. ఈ ఘటన న్యూయార్క్ గవర్నర్ క్యాథీ హోచుల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

# వంగవీటి రంగా విగ్రహానికి అవమానం..

## చంద్రబాబు సీరియస్..

ఏలూరు: జిల్లా కైకలూరులో కాపు నేత వంగవీటీ రంగా విగ్రహానికి అవమానం జరిగింది. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు పేడపూసి అవమానపరిచారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కాగా.. ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన ఆయన.. కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పాలాభిషేకం చేసి వంగవీటి రంగా విగ్రహాన్ని శుద్ధి చేశారు.

కాపు నేత, దివంగత వంగవీటి మోహన్ రంగా విగ్రహం పట్ల జరిగిన దుశ్చర్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఖండించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇలాంటి పనులు చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. దీనికి కారణమైన వారిని వెంటనే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది.

"ఏలూరు జిల్లా, కైకలూరు నియోజకవర్గం, కలిదిండిలో వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని





అవమానపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అభిమానుల మనోభావాలు దెబ్బతినేలా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా దుశ్చర్యలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు" అంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది.

### అసలు ఏం జరిగింది?

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో వంగవీటి రంగా విగ్రహాలకు అవమానం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో వంగవీటి రంగా విగ్రహాలకు పేడ పూయటం కలకలం రేపింది. కలిదిండి మండలంలోని కలిదిండి, ఆ పక్కనే ఉన్న మరో గ్రామం రుద్రవరంలోనూ వంగవీటి మోహన రంగా విగ్రహానికి దుండగులు పేడ పూయటం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఘటనలకు పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నాయకుల విగ్రహాల మీద ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

మరోవైపు ఇద్దరు వ్యక్తులు ఈ చర్యకు పాల్పడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అర్ధరాత్రి 01:05 నిమిషాలకు కలిదిండి ప్రధాన సెంటర్లో ఉన్న వంగవీటి మోహన రంగా గారి విగ్రహానికి పేడ పూసి అవమానించినట్లు భావిస్తున్నారు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ విగ్రహానికి పాలాభిషేకం చేసి శుద్ధి చేశారు. సమాజంలో అల్లర్లు లేపటానికి.. కావాలనే ఒక సామాజిక వర్గాన్ని ఉసిగొల్పడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని కామినేని శ్రీనివాస్ ఆరోపించారు. ఇలాంటి వాటిని ఉపేక్షించబోమని హెచ్చరించారు,. వీలైనంత త్వరగా కారణమైన వారిని గుర్తించి.. నడిరోడ్డు పై నడిపించి తగిన బుద్ధి చెప్తానని అన్నారు. రంగా అభిమానులు శాంతం వహించాలని కోరారు.

కారణమైనవారు ఎవరైనా వదిలిపెట్టేది లేదని.. వారికి తగిన శిక్ష పడేలా చెయ్యటం తన బాధ్యత అని కామినేని శ్రీనివాస్ అన్నారు. రాబోయే కాలంలో ఎవరైనా ఇలాంటి పనులు చెయ్యాలంటే వెన్నులో వణుకుపుట్టేలా చేస్తామని కామినేని శ్రీనివాస్ హెచ్చరించారు.

# 300 సినిమాల చరిత్రకు మళ్లీ ఊపిరి పోశారు

ఏపీ: సినిమా చెట్టు గురించి తెలిసే ఉంటుంది.. దాదాపు 300కుపైగా సినిమాల్లో ఈ చెట్టు కనిపించింది. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవంలో ఈ సినిమా చెట్టు ఉంది. అయితే ఈ చెట్టు గతేడాది భారీ వర్షాలు, వరదలకు కూలిపోయిన సంగతి తెలిసిందే. అయితే ఆ చెట్టు మళ్లీ చిగురించింది.. మళ్లీ ఆ చెట్టుకు ప్రాణం పోశారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్, గ్రీన్ భారత్ వనం-మనం విభాగం కలిసి దీనికి పునర్జీవం పోశారు. రేకపల్లి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో చెట్టుకు రసాయనాలతో చికిత్స చేశారు. వేరు మధ్యలో ఒక కొత్త మొక్కను నాటారు. ఇప్పుడు ఆ మొక్క 10 అడుగుల ఎత్తుకు ఎదిగింది. ఈ సినిమా చెట్టుకు మళ్లీ పునరుజ్జీవం వచ్చింది.



ఈ చెట్టు దగ్గర దాదాపు 300 సినిమాల చిత్రీకరణ జరిగింది.. ఈ చెట్టుకు దాదాపు 150 ఏళ్ల చరిత్ర ఉందని చెబుతారు. ఈ చెట్టు గోదావరి గట్టున ఉంది. దీని పేరు నిద్రగన్నేరు వృక్షం. ఇది చాలామందికి ఇష్టమైన చెట్టు. గతేడాది వరదల కారణంగా చెట్టు రెండుగా చీలిపోయింది. అది నేలకూలడంతో చాలామంది బాధపడ్డారు. రాజమహేంద్రవరంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఐకాన్స్ ఆ చెట్టును బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకున్నారు. వేర్లు, కొమ్మలు కత్తిరించి రసాయన మిశ్రమాలు పూశారు. గాలి, ధూళి తగలకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ తర్వాత కొద్దిరోజులకు చెట్టు కాండం, కొమ్మల భాగాల్లో పచ్చని చిగుళ్లు వచ్చాయి. తర్వాత ఆ చెట్టు ఏపుగా పెరిగింది. ఆ తర్వాత రైతులు ఎలుకల బెడదతో ఇబ్బంది పడ్డారు. మొలకలు రాగానే ఎలుకలు తినేస్తుండటంతో నష్టం వాటిల్లింది. ముగ్గురు వ్యక్తులు నిరంతరం పొలం వద్ద ఉండి, రసాయనాలు చల్లుతూ పంటను కాపాడే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత జాగ్రత్తలు తీసుకోవడంతో చెట్టు ఇప్పుడు 10 అడుగుల ఎత్తు వరకు పెరిగింది. మొత్తానికి ఎంతో చరిత్ర ఉన్న ఈ చెట్టును బతికించారు.. స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెట్టు వచ్చే ఏడాదికి నలుగురికి నీడను ఇస్తుందని చెబుతున్నారు.

# ఒక్క మెసేజ్‌తో రూ.1.96కోట్లు కొట్టేశారు

ఏపీ: మంత్రి అల్లుడికి సైబర్ మోసం తప్పలేదు.. ఏకంగా రూ.కోట్లలో మోసం జరిగింది. పోలీసులు రంగంలోకి దిగి ఈ కేసులో నిందితుల్ని కూడా అరెస్ట్ చేశారు. ఈ ఘటన ఆలస్యంగా బయటకొచ్చింది. ఏపీ మంత్రి నారాయణ పెద్ద అల్లుడు పునీత్ ఓ కంపెనీ నడుపుతున్నారు. అక్కడ అకౌంటెంట్‌గా పనిచేసే ఉద్యోగికి పునీత్ పేరుతో వాట్సాప్‌కు ఓ మెసేజ్ వచ్చింది. తన బ్యాంక్ అకౌంట్‌కు అర్జెంటుగా రూ.1.96 కోట్లు పంపించమని ఆ మెసేజ్‌లో సారాంశం. అకౌంటెంట్ నిజం అనుకుని వెంటనే ఆ డబ్బుల్ని ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆ మరుసటి రోజు డబ్బుల విషయాన్ని అకౌంటెంట్ తన యజమాని పునీత్‌కు చెప్పగా.. ఆ మెసేజ్ గురించి తనకు తెలియదనడంతో అవాక్కయ్యారు. అప్పుడు సైబర్ మోసం జరిగిందని వారు గుర్తించి ఈ మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగి ఆరా తీస్తే.. యూపీకి చెందిన సంజీవ్ అనే వ్యక్తి నేరం చేసినట్లు తేలింది. అతడ్ని నెల క్రితం పోలీసులు పట్టుకున్నారు.. ఈ క్రమంలో తాజాగా మరో నిందితుడు అరవింద్ కుమార్ శ్రీవాస్తవ్‌ను



కూడా యూపీలో అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో నిందితుడు ఉన్నట్లు చెబుతున్నారు.. అతడు పరారీలో ఉన్నాడట.. అయితే పోలీసులు ఈ కేసులో రూ.1.40కోట్లు డబ్బులు ఫ్రీజ్ చేశారని చెబుతున్నారు.

ఈ కేసులో రూ.1.40 కోట్లను ఫ్రీజ్ చేసి త్తరప్రదేశ్‌లో సంజీవ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని పోలీసులు తెలిపారు. కోర్టు రూ.49 లక్షలు విడుదల చేయడానికి అనుమతి ఇచ్చిందని.. ఈ కేసులో రెండో వ్యక్తి అరవింద్‌కుమార్ శ్రీవాత్సవ్‌ను కూడా ఉత్తరప్రదేశ్‌లోనే అరెస్ట్ చేశామన్నారు. ప్రధాన నిందితుడి కోసం పోలీసులు వెతుకుతున్నామన్నారు. 'భారీ మొత్తాల్లో నగదు ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఉపయోగించే కరెంట్ ఖాతాదారులకు సైబర్ నేరగాళ్లు 2శాతం నగదు కమీషన్‌గా చెల్లిస్తున్నారు' అని తమ దర్యాప్తులో తేలిందంటున్నారు పోలీసులు. మంత్రి అల్లుడిని సైబర్ కేటుగాళ్లు టార్గెట్ చేయడం సంచలనంగా మారింది.. అయితే డబ్బులు మాత్రం సేఫ్‌గా ఉన్నాయంటున్నారు.

# అయ్యో రైతన్నా ఎంత కష్టమొచ్చింది

కడప: రైతే రాజు, రైతే దేశానికి వెన్నెముక అంటూ ఎన్నో గొప్ప మాటలు విన్నాము. అదంతా ఒకప్పుడు.. ఇప్పుడు దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు దయనీయ స్థితిలో ఉన్నారు. వ్యవసాయం భారంగా మారింది.. కష్టపడి పండిస్తే గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు వ్యవసాయం చేయడానికి పెట్టుబడి భారం అవుతోంది. కూలీల ఖర్చులు, ఎరువుల ఖర్చులు వంటివి ఉన్నాయి. అయితే, పంట అమ్మేటప్పుడు సరైన ధర ఉండటం లేదు. దీనివల్ల పెట్టుబడికి, వచ్చే డబ్బుకు పొంతన ఉండటం లేదు. పంట మొదలు నుంచి చేతికి వచ్చే వరకు చాలా ఖర్చు అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు కనీసం కూలీలను పెట్టి పనులు చేయించలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఓ రైతు తన పొలంలో కూలీలతో కలుపు తీయిస్తే ఖర్చు పెరుగుతుందని.. ఎద్దుల అరక సాయంతో తీయించినా భారంగా మారుతుందని కొడుకు, కూతుర్ని కాడెద్దులుగా మార్చి కలుపు తీశాడు. కడప జిల్లా పెండ్లిమర్రి మండలం మమ్ముసిద్దుపల్లెకు చెందిన బండి చంద్రశేఖర్‌రెడ్డి అనే రైతు తన కొడుకు, కూతుర్ని ఎద్దులుగా మార్చి పొలంలో కలుపు తీశాడు. సాగు ఖర్చు తగ్గించుకోవడానికి ఇలా చేశాడు. చంద్రశేఖర్‌రెడ్డికి మొత్తం 9.5 ఎకరాల పొలం ఉంది. అందులో 3 ఎకరాలలో చామంతి సాగు చేస్తున్నారు. ఒక్కో ఎకరానికి దాదాపు రూ.70 వేలు ఖర్చు అవుతుంది.. కలుపు తీయడానికి చాలా ఖర్చు అవుతోంది. ఎకరా కలుపు తీయడానికి రూ.1500 అవుతుందని భావించి.. ఆ ఖర్చు తగ్గించుకోవాలని భావించాడు. రైతు అందుకే కొడుకును, కూతురును కాడెద్దులుగా మార్చుకున్నాడు.

తండ్రికి సహాయం చేయడానికి కూతురు, కొడుకు కాడెద్దులుగా మారారు. చంద్రశేఖర్‌రెడ్డి కొడుకు డిగ్రీ చదువుతుండగా, కూతురు ఇంటర్ చదివినట్లు తెలుస్తోంది. తాను సాగు చేసిన పంట కోత సమయానికి పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదని.. అప్పటికి గిట్టుబాటు ధర ఉంటుందో లేదో అని భావించి ఇలా చేశానంటున్నారు రైతు చంద్రశేఖర్ రెడ్డి.

# సముద్రంలో గ్యాస్ పైప్‌లైన్ లీక్..

ఏపీ: యానాంలో ప్రమాదం జరిగింది. అర్ధరాత్రి ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్‌లైన్ పగిలి మంటలు ఎగసిపడ్డాయి. దరియాలతిప్ప ఐల్యాండ్ నెంబర్ 3 వద్ద గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న ఓఎన్‌జీసీ అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టారు. సముద్రంలోని గ్యాస్ ఉత్పత్తి కేంద్రంలో సరఫరా నిలిపివేయడంతో శుక్రవారం తెల్లవారు జామున మంటలు అదుపులోకి వచ్చాయి. యానాంలో గ్యాస్? పైప్? లీకేజ్? ఘటనపై సీఎం చంద్రబాబు అంబేద్కర్? కోనసీమ జిల్లా కలెక్టర్?... ఇతర అధికారులతో చర్చించారు. గ్యాస్? లీక్? అయిన గంటన్నర సమయంలోనే అరికట్టేందుకు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని కలెక్టర్? సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఓఎన్?జీసీ పైప్? లైన్? మొత్తం చెక్ చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమీప గ్రామాల ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు అధికారులకు సూచించారు.

# కొత్తగా నేషనల్ హైవే..



ఏపీ: మరో జాతీయ రహదారికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కడప జిల్లాలోని బద్వేల్ నుండి నెల్లూరు వరకు జాతీయ రహదారి 67ను నాలుగు వరుసలుగా విస్తరించను న్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభలో వెల్లడించారు. రూ.3,653 కోట్లతో 108.13 కిలోమీటర్ల మేర రహదారిని అభివృద్ధి చేస్తారు. ఈ ప్రాజెక్టు కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం పారిశ్రామిక ప్రాంతాలకు అనుసంధానంగా ఉంటుంది. దీని ద్వారా కృష్ణపట్నం పోర్టుకు రవాణా మరింత సులభతరం కానుంది.

ఏపీలో మరో నేషనల్ హైవేకు సంబంధించి కేంద్రం కీలక ప్రకటన చేసింది. కడప జిల్లా బద్వేల్ నుంచి నెల్లూరు వరకు ఉన్న నేషనల్ హైవే 67ను నాలుగు వరుసలుగా విస్తరించనున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభలో తెలిపారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. కడప జిల్లా గోపవరం నుంచి నెల్లూరు జిల్లాలో నేషనల్ హైవే16లో గురువిందపూడి వరకు ఈ రహదారిని అభివృద్ధి చేస్తారు. దీనికి బీఓటీ పద్ధతిని ఉపయోగిస్తారు. మొత్తం 108.13 కి.మీ మేర ఈ జాతీయ రహదారిని రూ.3,653 కోట్లతో విస్తరిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం పారిశ్రామిక ప్రాంతాలకు అనుసంధానం ఏర్పడుతుంది కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ హైవేను రూ.3,653 కోట్లతో విస్తరించనున్నామని.. ఈ రహదారి అభివృద్ధి వల్ల ఆ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది అన్నారు. కడప జిల్లాలోని గోపవరం దగ్గర మొదలయ్యే ఈ నేషనల్ నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు జంక్షన్ వరకు వెళ్తుంది. ఈ రహదారి పూర్తయితే కృష్ణపట్నం పోర్టుకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుంది అంటున్నారు. బద్వేల్ నుంచి కృష్ణపట్నం పోర్టుకు దూరం తగ్గుతుందంటున్నారు. ప్రస్తుతం 142 కిలోమీటర్లు ఉన్న దూరం.. హైవే అందుబాటులోకి వస్తే 108.13 కిలోమీటర్లకు తగ్గుతుంది అంటున్నారు. ఈ నేషనల్ హైవే కృష్ణపట్నం పోర్టుకు సరుకులు త్వరగా చేరవేయవచ్చని.. ఇది వాణిజ్యానికి కూడా ఎంతో ఉపయోగపడుతుంది అంటున్నారు. 2025-26లో రాష్ట్రానికి రూ.12,152 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఈ నిధులతో 457 కిలోమీటర్ల మేర 28 పనులు చేపట్టనున్నామని.. అలాగే రూ.26,453 కోట్లతో 383 కి.మీ. పొడవైన 3 ప్రాజెక్టులను చేపట్టాలని యోచిస్తోందన్నారు. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో రహదారుల నిర్మాణం వేగంగా జరుగుతోందని చెప్పారు. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో కడప-రంగంపేట క్రాస్ సెక్షన్ రహదారి, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో కర్నూలు-కడప సెక్షన్ రహదారి ప్రస్తుతం డీపీఆర్ దశలో ఉన్నాయన్నారు.

ప్రకాశం జిల్లాలో రహదారి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సింగరాయకొండ నుండి మాలకొండ వరకు రహదారిని అభివృద్ధి చేయడానికి 2021లో రూ. 369.8 కోట్లు మంజూరయ్యాయి. 2024 మార్చి నాటికి రూ. 169.8 కోట్లు ఖర్చు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 120.8 కోట్లు ఖర్చు చేయడానికి నిధులు సిద్ధంగా ఉన్నాయి. మాలకొండ నుండి సీఎస్.పురం వరకు రహదారి నిర్మాణానికి ఇప్పటివరకు రూ. 74 కోట్లు ఖర్చు చేశారు. ఈ సంవత్సరం రూ.100.6 కోట్లు ఖర్చు చేస్తారు. ఈ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.



# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.. మీకేమైనా ఇబ్బందులు ఉంటే..

ఏపీ: ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేస్తోంది. ఆగస్ట్ 25వ తేదీ నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనుంది. మొత్తం నాలుగు విడతల్లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఏయే జిల్లాల్లో ఎప్పుడు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తారనేది ఇక్కడ తెలుసుకుందాం. అలాగే రేషన్ కార్డులలో ఏవైనా ఇబ్బందులు వస్తే ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ కూడా ఏర్పాటు చేసింది. ఆ వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.

ఏపీ ప్రభుత్వం పేదలకు శుభవార్త వినిపించింది. పేదలకు కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేయనుంది. రాష్ట్రంలోని కోటీ 45 లక్షల మంది రేషన్ కార్డుదారులకు కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు. ఆగస్ట్ 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు ఏపీ పౌరసరఫరాల శాఖ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈనెల 25 నుంచి నాలుగు విడతల్లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలోని1.45 కోట్ల కార్డుదారుల కుటుంబాలకు.. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా రేషన్ షాపుల వద్దే స్మార్ట్ రేషన్ కార్డులను ఉచితంగా అందించనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరగనుంది. మరోవైపు ఈసారి కొత్తగా 6.71 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు జారీ చేస్తున్నారు. మరోవైపు రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని చెప్తున్న ప్రభుత్వం.. స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రభుత్వం రాజముద్ర, కుటుంబసభ్యుల వివరాలు, క్యూఆర్‌కోడ్ ఉంటాయని తెలిపింది. అలాగే స్మార్ట్ రేషన్ కార్డుల జారీ, పంపిణీ, ఇంకా ఏవైనా విషయాల్లో సమస్య ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1967ను సంప్రదించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

మరోవైపు ఆగస్టు 25 నుంచి నాలుగు విడతల్లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు. తొలి విడతలో భాగంగా ఆగస్ట్ 25వ తేదీన విశాఖపట్నం, విజయనగరం, నెల్లూరు,ఎన్టీఆర్, తిరుపతి, కృష్ణా, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో పంపిణీ చేస్తారు. ఆ తర్వాత ఆగస్టు 30 నుంచి గుంటూరు, ఏలూరు, కాకినాడ, చిత్తూరు జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతపురం, అంబేద్కర్ కోనసీమ జిల్లా, అనకాపల్లి జిల్లాల్లో సెప్టెంబరు 6 నుంచి పంపిణీ చేస్తారు. ఇక ఆఖరి విడతగా సెప్టెంబరు 15 నుంచి పల్నాడు,బాపట్ల, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లా, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు,ప్రకాశం జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డులు అందించనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు.

# డ్వాక్రా మహిళలకు రూ.40వేలు.. వారికి 35శాతం రాయితీ..



ఏపీ: ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. పచ్చళ్లు, పిండి వంటలు, పశువుల దాణా పరిశ్రమలకు 35 శాతం రాయితీతో ఆర్థిక సహాయం చేస్తోంది. డ్వాక్రా మహిళలకు ప్రత్యేకంగా రూ.40 వేల సాయం అందజేస్తుంది. ఆసక్తి గల ఔత్సాహికులు ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ తెలిపింది. మరిన్ని వివరాల కోసం జిల్లా, మండల స్థాయి అధికారులను సంప్రదించవచ్చు.

పచ్చళ్లు, పిండి వంటలు, పశువుల దాణా వంటి పరిశ్రమలు పెట్టడానికి ప్రోత్సాహకాలు ఇస్తోంది. కేవలం 10 శాతం పెట్టుబడి పెడితే చాలు.. మిగిలిన పెట్టుబడి ప్రభుత్వమే ఆర్థికంగా సహాయం చేస్తుంది. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద 35 శాతం వరకు రాయితీ ఇస్తారు. గరిష్టంగా రూ.10 లక్షల వరకు రాయితీ పొందవచ్చు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ రామ్మోహన్

రాష్ట్రంలో రూ.5 లక్షల లోపు పరిశ్రమలు అనుకుంటే.. అప్పడాలు, పచ్చళ్లు, పొడులు, చిప్స్, కేక్‌లు.. దోస, ఇడ్లీ పిండి తయారీ.. ఫ్లేవర్డ్ మిల్క్ వంటి యూనిట్లు సహా పెట్టుకోవచ్చు. అలాగే రూ.5 నుంచి10 లక్షలు.. రూ.10-20 లక్షలు ఇలా పరిశ్రమలు పెట్టుకోవచ్చు. నూనెల తయారీ, జెల్లీ, సాస్, కెచప్‌ల తయారీ, పప్పు మిల్లులు, ఆహార శుద్ధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. చాక్లెట్లు, చీజ్, పన్నీర్, జామ్, చపాతీ, పశువుల దాణా, అల్లం-వెల్లుల్లి పేస్ట్, పానీ పూరీ తయారీ, కాఫీ ప్రాసెసింగ్, పండ్ల రసాల యూనిట్ వంటివి కూడా ఉన్నాయి. ఈ పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునేవారు దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల స్థాయిలో అధికారుల్ని అడిగి వివరాలు తెలుసుకోవచ్చు. అంతేకాదు వారి యూనిట్ వివరాలతో ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ http:///pmfmeap.org ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ దరఖాస్తు కోసం ఆధార్, పాన్ కార్డు, యూనిట్ అడ్రస్ కోసం ఓ డాక్యుమెంట్.. అలాగే యూనిట్ నిర్వహించే భవనం, ఆరు నెలలకు సంబంధించి బ్యాంకు లావాదేవీలు ఉండాలి. వీటితో పాటుగా యంత్రాలు, షెడ్ కొటేషన్లు కూడా అప్‌లోడ్ చేయాలని సూచిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

# నవ దంపతుల అనుమానాస్పద మృతి.. రాత్రి ఏం జరిగింది?

విజయనగరం: జిల్లాలో దారుణం జరిగింది. కొత్త వలస మండలం తమ్మన్నమెరక దగ్గర ఒక కాలనీలో నవ దంపతులు అనుమానాస్పద మరణం కలకలం రేపింది. చనిపోయిన వారిని కొప్పుల చిరంజీవి (30), గీతల వెంకటలక్ష్మి (28)గా గుర్తించారు. భర్త ఫ్యానుకు ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. భార్య నేలపై విగతజీవిగా పడి ఉంది. చిరంజీవి, వెంకటలక్ష్మికి 8 నెలల క్రితం వివాహమైంది.. ఈ జంట అన్యోన్యంగా ఉండేవారని బంధవుల అంటున్నారు. చిరంజీవి విశాఖపట్నంలో ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. వెంకటలక్ష్మి కొత్తవలసలోని ఒక ప్రైవేట్ స్టోర్‌లో పనిచేసేది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.. చిరంజీవి, వెంకటలక్ష్మి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్నారు. వివాహైన 8 నెలలకే ఇలా చనిపోడంతో వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేగిడి మండలంలోని ఉనుకూరులో మరో దారుణ జరిగింది. గురువారం ఒక యువతిపై ఆమె పెద్దనాన్న వరుసయ్యే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. తల్లి కూలి పనికి వెళ్లిన సమయంలో యువతి ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆ సమయంలో దిబ్బ రాము అనే వ్యక్తి ఇంట్లోకి చొరబడ్డాడు. అతను ఆమెతో అసభ్యంగా ప్రవర్తించ బోయాడు. యువతి గట్టిగా కేకలు వేయడంతో రాము అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న బాధితురాలి బంధువులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిని పట్టుకుని విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాదారు.. ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు రామును అదుపులోకి తీసుకుని



స్టేషన్‌కు తరలించారు

విజయనగరంలో అప్పుల బాధతో టి.శంకరరావు అనే 67 ఏళ్ల వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. శంకరరావు గతంలో లాటరీ టికెట్లు అమ్మేవారు. వృద్ధాప్యం కారణంగా కొన్ని రోజులుగా ఇంటి వద్దే ఉంటు న్నారు. ఈ క్రమంలో ఆయనకు రూ.6 లక్షల వరకు అప్పులు అయ్యాయి.. అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తా పానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 20న ఆయన ఆత్మహత్యకు ప్రయత్నించారు. కుటుంబ సభ్యు లు వెంటనే ఆసుపత్రికి తరలించారు. మహారాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి ఆయన మరణించారు. అయితే శంకరరావుకు భార్య, కుమారుడు ఉన్నారు.. ఈ ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.



# బ్యాట్ కోసమే బాలికను చంపేశాడు..

**ఆ లెటర్ పాతది..**

కూకట్‌పల్లి: మైనర్ బాలిక సహస్ర హత్య కేసులో పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పదో తరగతి చదువుతున్న బాలుడు సహస్రను దారుణంగా హత్య చేశాడు. ఇక ఈ కేసు విచారణలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. బాలుడు పక్కా పథకం ప్రకారమే బాలిక సహస్రను హత్య చేశాడని.. ఆ తర్వాత తన గురించి ఎవరికి తెలియకుండా.. ఎంతో తెలివిగా వ్యవహరించి తమనే బురిడీ కొట్టించాడని పోలీసులు తెలిపారు. ఇక ఈకేసుకు సంబంధించి సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్‌లు కీలక వివరాలు వెల్లడించారు.

సమావేశంలో మాట్లాడుతూ.. మృతురాలు ఇంట్లో ఉన్న బ్యాట్ దొంగతనం చేయడం కోసమే నిందితుడు వారి ఇంటికి వెళ్లాడని తెలిపారు. నిందితుడైన బాలుడు.. సహస్ర వాళ్ల ఇంట్లో కిచెన్‌లో ఉన్న బ్యాట్‌ని తీసుకుని బయటకు వస్తుండగా.. అక్కడే కూర్చుని టీవీ చూస్తున్న సహస్ర అతడిని చూసి దొంగా.. దొంగా అని అరిచిందని.. దీంతో కంగారుపడ్డ బాలుడు.. సహస్ర అరుపులు ఎవరైనా వింటే వచ్చి తనను చూస్తారని భయపడి ఆమెను కిందకు తోశాడని తెలిపారు. ఆ వెంటనే తన దగ్గర ఉన్న కత్తితో సహస్రపై విచక్షణారహితంగా దాడి చేసి చంపేశాడని పోలీసులు వెల్లడించారు.

ఆ తర్వాత నేరం కప్పిపుచ్చుకోవడానికి బాలుడు చాలా తెలివిగా వ్యవహరించాడని పోలీసులు తెలిపారు. హత్యకు వాడిన కత్తిని కడిగి దాచాడని.. అలానే తన టీ షర్ట్‌పై రక్తపు మరకలు పడ్డాయని.. తల్లిదండ్రులకు తెలియకుండా వాటిని కవర్ చేసుకుని ఇంట్లోకి వెళ్లి.. స్నానం చేసిన తర్వాత షర్ట్‌ని వాషింగ్ మెషిన్‌లో వేసినట్లు వెల్లడించారు. ఇక బాలుడి వద్ద దొరికిన లేటర్ ఇప్పుడు రాసింది కాదని.. ఎప్పుడో నెల క్రితం రాశాడని.. పోలీసులు తెలిపారు. విచారణ సందర్భంగా నిందితుడు పోలీసులను తప్పు దారి పట్టించాడని చెప్పుకొచ్చారు.

అయితే బాలుడు కేవలం బ్యాట్ దొంగతనం కోసమే బాలిక ఇంటికి వెళ్లాడని.. డబ్బులు దొంగతనం చేయలేదని పోలీసులు తెలిపారు. అలానే బాలుడు స్కూల్‌కి సరిగా వెళ్లేవాడు కాదని.. యూట్యూబ్, ఓటీటీల్లో క్రైమ్, థ్రిల్లర్ మూవీలు చూసి.. తనదైన లోకంలో ఉండే వాడని.. వాటి ప్రభావంతోనే దొంగతనానికి ప్లాన్ వేసుకున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద కత్తి, లేఖ దొరికిందని తెలిపారు. అయితే బాలుడి తల్లి ముందుగానే దీని గురించి నిందితుడిని ప్రశ్నించిందని.. అప్పుడు నిందితుడు నువ్వే నన్ను పట్టించేలా ఉన్నావని అన్నాడని నిందితుడి తల్లి తెలిపిందని పోలీసులు చెప్పుకొచ్చారు.

# యూరియా సమస్యకు చెక్ పెట్టేందుకు కీలక చర్యలు



తెలంగాణ: యూరియా కొరత రైతులు, రాజకీయ నాయకుల మధ్య చిచ్చు పెడుతోంది. యూరియా కోసం రైతులు క్యూలలో పడిగాపులు కాస్తున్నారు. ఈ అంశంలో విపక్షాలు ప్రభుత్వ అసమర్థతను ఎత్తి చూపుతున్నాయి. ఈ సమస్యపై కాంగ్రెస్ కేంద్రంపై విమర్శలు చేస్తుండగా.. బీజేపీ నేతల కాంగ్రెస్ మీద ఆరోపణలు చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించ డానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రంగంలోకి దిగారు. కీలక చర్యలకు ఉపక్రమించారు. ప్రస్తుతం తెలంగాణలో రైతంగాన్నే కాక రాజకీయాల్లో కూడా యూరియా సమస్య ప్రకంపనలు సృష్టిస్తోంది. యూరియా కోసం రైతులు.. క్యూ లైన్లలో నిలబడి పడిగాపులు కాస్తున్నారు. దీనిపై విపక్షాలు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నాయి. ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం అని మండిపడుతున్నాయి. అయితే తమ విన్నపాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. కేంద్రం ప్రభుత్వం సరిపడా యూరియా సరఫరా చేసిందని.. రాష్ట్ర ప్రభుత్వమే దాన్ని బ్లాక్‌లో అమ్ముకుంటుందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. అన్నదాతలు కూడా యూరియా కొరత మీద ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యూరియా సమస్య తీవ్రమవుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దీని పరిష్కారం కోసం రంగంలోకి దిగింది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక చర్యలకు పూనుకున్నారు. యూరియాను సరఫరా చేయడంలో ఆలస్యానికి తావు లేకుండా.. దాన్ని వెంట వెంటనే కేంద్రాలకు తరలించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ వారిని అప్రమత్తం చేస్తున్నారు. దీంతో పాటు కొన్ని జిల్లాల్లో లారీ అసోసియేషన్స్ మధ్య పోటీ ఏర్పడి.. యూరియా రవాణా నిలిచిపోయింది. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ట్రాన్స్‌పోర్ట్ సమస్యను స్వయంగా మాట్లాడి పరిష్కరిస్తున్నారు.

దక్షిణ అమెరికాను వణికించిన భూకంపం

అలానే రాష్ట్రంలోని రామగుండం యూరియా ఫ్యాక్టరీ యాజమాన్యంతో కూడా మంత్రి తుమ్మల నిరంతర సంప్రదింపులు జరుపుతున్నారు. నేడు అనగా శనివారం నాడు మంత్రి తుమ్మల రామగుండం ఫ్యాక్టరీ ఎండీని కలవనున్నారు. కాగా, సాంకేతిక సమస్య కారణంగా రామగుండం ఫ్యాక్టరీలో యూరియా ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఇక్కడ యూరియా ఉత్పత్తి ప్రారంభం అయితే.. రాష్ట్రంలో యూరియా సమస్య కొంతైనా తీరే అవకాశం ఉందని సర్కార్ భావిస్తోంది. ఆ దిశగా చర్యలు తీసుకునేందుకు రెడీ అవుతోంది.

తెలంగాణ అన్నదాతలు ఎదుర్కొంటున్న యూరియా సమస్య పరిష్కారం కోసం కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటు వేదికగా గళమెత్తారు. యూరియా సమస్యను పరిష్కరించాలంటూ.. రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ఆందోళనకు దిగారు. ప్రియాంక గాంధీ కూడా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలానే బీఆర్ఎస్ ఎంపీలు కూడా యూరియా సమస్యను పరిష్కరించాలంటూ కేంద్రాన్ని కోరారు. ఈ క్రమంలో రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర గురువారం ఢిల్లీలో కేంద్ర ఎరువులు రసాయనాల మంత్రి జేపీనడ్డాను కలిసి.. తెలంగాణలో తీవ్రమవుతున్న యూరియా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు.

# ఆ శాఖలో 1,623 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

తెలంగాణ: ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలను మెరుగుపరచడానికి వైద్యారోగ్య శాఖ 1,623 వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. టీవీవీపీ, ఆర్టీసీ ఆసుపత్రులలో ఈ నియామకాలు జరగనున్నాయి. మరోవైపు, రెవెన్యూ శాఖలో 217 కొత్త పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది, వీటిని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవల మెరుగుదల కోసం ఒక ముఖ్యమైన అడుగు వేసింది. వైద్యారోగ్య శాఖ పరిధిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆర్టీసీ ఆసుపత్రులలో మొత్తం 1,623 వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో టీవీవీపీ ఆసుపత్రుల్లో 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, ఆర్టీసీ ఆసుపత్రుల్లో ఏడు పోస్టులు ఉన్నాయి.

ఈ ప్రకటనను వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు శుక్రవారం విడుదల చేసింది ఆన్‌లైన్ దరఖాస్తులు సెప్టెంబరు 8 నుంచి సెప్టెంబరు 22 వరకు అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు విడివిడిగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పోస్టులను మల్టీజోన్-1 (858), మల్టీజోన్-2 (765) పరిధిలో భర్తీ చేయనున్నారు. వివిధ స్పెషలిస్టుల పోస్టులు కూడా ఈ నోటిఫికేషన్‌లో భాగంగా ఉన్నాయి. ఈ నియామకాల ద్వారా ఎంపికైన వైద్యులు ప్రైవేటు ప్రాక్టీస్ చేయడానికి వీలు లేదని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నియామకాలు పూర్తయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న తీవ్రమైన వైద్యుల కొరత తీరుతుంది. ప్రస్తుతం, టీవీవీపీ పరిధిలోని 178 ఆసుపత్రుల్లో మొత్తం 4,357 వైద్యుల పోస్టులు మంజూరైనప్పటికీ, కేవలం 1,369 మంది రెగ్యులర్, 565 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. ఈ తాజా నియామకాలతో పల్లె ప్రజలకు వైద్యసేవలు అందించే జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యుల లభ్యత గణనీయంగా పెరుగుతుంది.

# ఒకటి రెండేళ్లకు పరిమితం కాదన్న కమిషనర్ రంగనాథ్..



హైదరాబాద్: హైడ్రా ఎంత పెద్ద సంచలనంగా మారిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్లాట్స్, ఫ్లాట్స్ కొనే వారు ఇప్పుడు అన్ని పత్రాలు ఉన్నా.. హైడ్రా నుంచి అప్రూవల్ తీసుకున్నారా లేదా..? అనేది అడుగుతున్నారు అంటే హైడ్రా ఎఫెక్ట్ ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్రమ కట్టడాలను కూల్చడం.. చెరువు ఎఫ్టీఎల్ పరిధిలోని భవనాల నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కమిషనర్ చెప్పుకొచ్చాడు. అందుకే హైదరాబాద్‌లో ఇళ్లను కొనే వారు ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిన అవసరం ఉందని కమిషన్ పేర్కొన్నారు.

పేరు తప్పనిసరిగా వినిపిస్తోంది. ఒక స్థలం, ఫ్లాట్ లేదా భవనం కొనుగోలు చేసే సమయంలో అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా.. "హైడ్రా అప్రూవల్ ఉందా?" అనే ప్రశ్నను కొనుగోలు దారులు తప్పనిసరిగా అడుగుతున్నారు. దీని ద్వారా హైడ్రా ప్రభావం ఎంత విస్తృతమైందో అర్థమవుతుంది. అక్రమ నిర్మాణాలను కూల్చడమే కాకుండా, చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ పరిధిలో భవనాల నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబో మని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "హైడ్రా ఒక తాత్కాలిక చర్య కాదు.. ఒక సంవత్సరం లేదా రెండు సంవత్సరాల వరకు ఉండి వెళ్లిపోయేది కాదని స్పష్టం చేశారు. దాదాపు వందేళ్ల ముందుచూపుతో ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆరు చెరువు లను అభివృద్ధి చేస్తున్నాం. గతంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సి బిలిటీ పేరుతో కొందరు ఆక్రమణలు చేసేందుకు ప్రయత్నించారు. వాటిని సాంకేతిక ఆధారాలతో గుర్తించి ఎఫ్‌టీఎల్ సరిహద్దులు ఖరారు చేస్తున్నాం" అని తెలిపారు. చెరువుల వద్ద భూముల ధరలు కోట్లు పలుకుతున్న నేపథ్యంలో ఆక్రమణలు పెరుగుతున్నా.. హైడ్రా వాటిని అడ్డుకుంటోందని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో నాలాలను కూడా అధికారికంగా నోటిఫై చేయడం ప్రారంభమైందని కమిషనర్ వివరించారు. రాజకీయ ఒత్తిళ్లకు లోనవకుండా ప్రజల భద్రత, ప్రభుత్వ భూముల రక్షణే హైడ్రా ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఓఆర్ఆర్ పరిధిలోని అన్ని చెరువులకు సంబంధించి తుది నోటిఫికేషన్ జారీ చేసే ప్రక్రియ ఈ ఏడాదిలో పూర్తి చేయాలని ప్రణాళిక రూపొం దించారు. గత ఏడాది కాలంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ హైడ్రా వెనక్కి తగ్గలేదని.. కూకట్‌పల్లి నల్ల చెరువు పునరుద్ధరణ దీనికి నిదర్శనమని ఆయన అన్నారు. నగరంలో వరదల సమస్య తగ్గించ దంలో.. పర్యావరణాన్ని కాపాడడంలో, ప్రజలలో నమ్మకం పెంపొందించడంలో హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని స్పష్టమైంది. ఈ ఏడాది బతుకమ్మ వేడుకలను బతుకమ్మ కుంటలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆ పరిసర ప్రాంతాలను ఇటీవల కమిషనర్ సందర్శించారు. చుట్టూ గ్రీనరీ ఉండాలని అధికారులను ఆదేశించారు.

# మహిళలకు బతుకమ్మ పండుగ కానుక..

తెలంగాణ: దసరా అంటే తెలంగాణలో చాలా పెద్ద పండుగ. దసరా సందర్భంగా తెలంగాణలో ఎంతో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తుంటారు. అందుకే ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఎక్కడెక్కడో ఉన్న వారు సైతం సొంత గ్రామాలకు చేరుకుంటారు. కుటుంబంతో కలిసి సంతోషంగా పండుగ చేసుకుంటారు. ఇక దసరా పెద్ద పండుగ కావడంతో ప్రభుత్వాలు కూడా పండుగ వేళ ప్రత్యేకంగా కానుకలు ఇస్తుంటాయి. ఈక్రమంలో తాజాగా బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలకు సర్కార్ మంచి బహుమతి అది కూడా రెండు ఇవ్వాలని భావిస్తోంది.



ఈసారి కాంగ్రెస్ గవర్నమెంట్ ఇందిరమ్మ చీరల పేరుతో మహిళలకు బతుకమ్మ కానుక ఇవ్వనుంది. ప్రభుత్వం మహిళా పొదుపు సంఘాలకు అందించే 'ఇందిరమ్మ' చీరల ఉత్పత్తిని వేగవంతం చేసింది. పొదుపు సంఘాల్లోని మహిళలకు ఒక్కొక్కరికి రెండు చీరలను ఉచితంగా పండుగ కానుకగా ఇచ్చేందుకు రేవంత్ సర్కార్ రెడీ అవుతోంది. ఇందుకోసం సిరిసిల్ల నేతన్నలకు సర్కార్ ఆర్డర్ ఇచ్చింది. మహిళలకు పంపిణీ చేయడం కోసం 65 లక్షల చీరల తయారీకి ఆదేశించింది. ఇందుకుగాను 2 విడతల్లో 9 కోట్ల మీటర్ల వస్త్రం అందించింది. సిరిసిల్ల పట్టణంలో నేత కార్మికులు అధికంగా ఉంటారు. ఎన్ని కల వేళ కాంగ్రెస్ పార్టీ.. వీరికి సంవత్సరం అంతా ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. దీనిలో భాగంగా ఫిబ్రవరిలోనే 'ఇందిరా మహిళా శక్తి' స్కీమ్ లో భాగంగా చీరలు తయారు చేసేందుకు ఆర్డర్ ఇచ్చింది. ఇందుకోసం రూ.318 కోట్లు కేటాయించింది. కూలీ ఖరారు అనంతరం.. ఏప్రిల్ నుంచి ఇందిరమ్మ చీరలు ఉత్పత్తిలో వేగం పెరిగింది. ఈ పథకం ద్వారా సుమారు 6 వేల మంది కార్మికులు నెలకు 20 వేల రూపాయల చొప్పున సంపాదించుకుంటూ ఉపాధి పొందుతున్నారు.

# నాగార్జునసాగర్, మంత్రాలయానికి ప్రత్యేక సర్వీసులు..

తెలంగాణ: కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుండటంతో నాగార్జున సాగర్‌కు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ హైదరాబాద్ నుండి నాగార్జున సాగర్‌తో పాటు శ్రీరంగాపురం, మంత్రాలయానికి ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రకటించింది. మియాపూర్ నుండి నాగార్జునసాగర్, ఎత్తిపోతల ప్రాజెక్టులకు ఒకరోజు టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది. అలాగే, ఎంజీబీఎస్ నుండి శ్రీరంగాపురం, మంత్రాలయానికి రెండు రోజుల టూర్ ప్యాకేజీని ప్రారంభించింది. ఈ టూర్ ప్యాకేజీలు పర్యాటకులకు, భక్తులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందిస్తాయి. నాగార్జున సాగర్ 26 గేట్లను పైకి ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. దీంతో సాగర్ ప్రాజెక్టు జలకళను సంతరించుకోగా.. పర్యాటకులు ఆ సుందర దృశ్యాలను చూసేందుకు క్యూ కడుతున్నారు. ఈనేపథ్యంలో హైదరాబాద్ నుంచి నాగార్జున సాగర్ వెళ్లాలనుకునే పర్యాటకులకు తెలంగాణ ఆర్టీసీ తీపి కబురు చెప్పింది. సాగర్‌తో పాటు శ్రీరంగాపురం, మంత్రాలయానికి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతూ టూర్ ప్యాకేజీలను ప్రకటించింది. ఈనెల 24వ తేదీ (ఆదివారం) ఉదయం 5 గంటలకు మియాపూర్ నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. ఈ టూర్‌లో పర్యాటకులు నాగార్జునసాగర్‌తో పాటు ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శించవచ్చు. రాత్రి 8 గంటలకు తిరిగి మియాపూర్‌కు చేరుకుంటారు. ఒక్కొక్కరికి రూ.1200 చొప్పున ఛార్జీ నిర్ణయించారు. టికెట్ బుకింగ్ లేదా ఇతర వివరాల కోసం 85003 09052 నంబర్‌లో సంప్రదించవచ్చు. భక్తుల కోసం టీఎస్‌ఆర్టీసీ డిపో-1 మేనేజర్ వేణుగోపాల్ శ్రీరంగాపురం, మంత్రాలయానికి ప్రత్యేక టూర్ ప్యాకేజీని ప్రకటించారు. ఈ బస్సు సర్వీసు ఈ నెల 30న ఉదయం 5 గంటలకు ఎంజీబీఎస్ నుంచి బయలుదేరుతుంది. ఇది రెండు రోజుల యాత్ర కానుంది. శ్రీరంగాపురంలోని రంగనాయక దేవాలయం, బీచుపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయం (కృష్ణా నది ఒడ్డున), ఐదో శక్తిపీఠంగా భావించే జోగులాంబ అమ్మవారి దేవస్థానం, తుంగభద్ర నది ఒడ్డున ఉన్న మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దేవాలయాలను ఈ ప్యాకేజీలో భాగంగా దర్శించుకోవచ్చు.

# ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గుడ్‌న్యూస్..

తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పోషకాహార లోపాన్ని నివారించడానికి ప్రభుత్వం రాగి జావ పంపిణీ చేయనుంది. శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సహకారంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. దీనికి ప్రభుత్వం రూ.14 కోట్లు కేటాయించింది. విద్యార్థులకు రాగి జావ అందించినందుకు వంట కార్మికులకు ప్రోత్సాహకంగా ఒక్క స్టూడెంట్‌కు రూ. 25 పైసలు ఇవ్వనున్నారు. రాష్ట్రంలోని సర్కారు పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల ఆరోగ్యానికి, పోషకాహార లోపాన్ని నివారించడానికి తెలంగాణ ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు రాగి జావ అందించనున్నారు. గత రెండేళ్లుగా ఈ రాగి జావ పంపిణీ కార్యక్రమం శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సహకారంతో కొనసాగుతోంది. ఈ ప్రతిపాదనపై విద్యాశాఖ రెండు నెలలుగా ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా తాత్సర్యం చేసింది. ఈ విషయంపై పత్రికల్లో వార్తా కథనాలు రావడం తో స్పందించిన విద్యాశాఖ.. ఆ 40 శాతం వ్యయాన్ని భరించేందుకు అంగీకరించింది. ఈ నిర్ణయంతో రాగి జావ పంపిణీ కార్యక్రమం మరింత పటిష్టంగా అమలు కానుంది. రాగి జావ పంపిణీ పథకానికి ఏడాదికి సుమారు రూ.37 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా సుమారు రూ.14 కోట్లు ఇవ్వనుంది. ఇది వారికి అవసరమైన పోషకాలను అందించి, ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడుతుంది.

# ఆగస్టు 27 వరకు ఆ మార్గాలు బంద్

**భారీ రద్దీ కారణంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నేటి నుంచి అనగా శనివారం ఉదయం 7 గంటల నుంచి ఆగస్టు 27 బుధవారం రాత్రి 10 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్ వెల్లడించారు.**



హైదరాబాద్: వినాయక చవితి సందడి మొదలైనం ది. ఆగస్టు 27 వినాయక చవితి నేపథ్యంలో విగ్రహాల కొనుగోలు, తరలింపు కోసం ఎక్కడెక్కడి నుంచో తరలి వస్తుంటారు. ఈక్రమంలో వినాయక విగ్రహాలకు ఫేమస్ అయిన ధూల్‌పేట ప్రాంతంలో రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ అధికారులు ధూల్‌పేట ప్రాంతంలో ఆంక్షలు విధించారు. నేటి నుండి ఆగస్టు 27 వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. వాహనదారులు దీన్ని గమనించి అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకోవాలని చెబుతున్నారు.

హైదరాబాద్ మహానగరంలో నిత్యం ఏదో ఒక కార్యక్రమం జరుగుతూనే ఉంటుంది. అలానే భాగ్యనగరంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు తవ్వకాలు, నిర్మాణాలు వంటివి జరుగుతూనే ఉంటాయి. అప్పుడప్పుడు కొన్ని ప్రత్యేక దినాల్లో పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తారు. ఈ క్రమంలో తాజాగా హైదరాబాద్ వాసులకు అధికారులు కీలక అలర్ట్ జారీ చేశారు. నగరంలో నేటి నుంచి ఆగస్టు 27 వరకు.. నాలుగు రోజుల పాటు పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆగస్టు 23, అనగా శనివారం నుంచే ఈ ఆంక్షలు అమల్లోకి వస్తాయని అధికారులు తెలిపారు. మరి ఎందుకు ఈ ఆంక్షలు విధించారు.. ఏఏ మార్గాల్లో ఇవి అమల్లో ఉంటాయి.. అనే వివరాలు మీకోసం..

నగరంలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా వినాయక చవితి పండుగ సంబరం మొదలైంది. వినాయక విగ్రహాల కోసం నగరానికి వచ్చే వారి సంఖ్య భారీగా ఉంటుంది. ఇప్పటికే పలువురు నగరానికి వచ్చి విగ్రహాలను తీసుకెళ్తున్నారు. ఇక పండగ నాడు, ముందు రోజు నగరానికి వచ్చే వారి సంఖ్య భారీగా ఉంటుంది. మరీ ముఖ్యంగా వినాయక విగ్రహాలకు ఫేమస్ అయిన ధూల్‌పేటలో గణేశ్ విగ్రహాల విక్రయం, కొనుగోలు, తరలింపు జోరుగా సాగుతుంటుంది. భారీ రద్దీ కారణంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నేటి నుంచి అనగా శనివారం ఉదయం 7 గంటల నుంచి ఆగస్టు 27 బుధవారం రాత్రి 10 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్ వెల్లడించారు.

### ట్రాఫిక్ ఆంక్షలు ఉండే ప్రాంతాలు..

ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో బోయిగూడ నుంచి గాంధీ విగ్రహం వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ మార్గంలో ఆగస్టు 23 నుంచి 27 వరకు సాధారణ వాహనాలకు అనుమతి ఉండదు. వినాయక విగ్రహాలను తీసుకెళ్లే వెహికల్స్.. గాంధీ విగ్రహం, పురానాపూల్ మీదుగా బోయిగూడ కమాన్ క్రాస్ రోడ్స్ నుంచి వెళ్లాలి. దీంతో ఈ రెండు ప్రాంతాల నుంచి మంగళహాట్ వైపు వెళ్లే సాధారణ వాహనాలను.. తక్కర్వాడి టీ జంక్షన్ నుంచి ఘోడే-కే-ఖబర్ వైపు మళ్లిస్తారు. వీటితో పాటు ఈ ఏరియాలోని మరి కొన్ని ప్రాంతాల్లో కూడా ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఇక వినాయక విగ్రహాలను తీసుకువెళ్లేందుకు వచ్చే లారీలు, డీసీఎంలను.. జుమ్మేరత్ బజార్ గ్రౌండ్లో పార్క్ చేయాలి. ఇవి రాత్రి 10 గంటల తర్వాతే విగ్రహాలను తీసుకెళ్లడానికి అనుమతి ఉందని అధికారులు తెలిపారు. ఒకవేళ భారీ వర్షాలు కురిస్తే.. ఈ వాహనాలను 100 ఫీట్ రోడ్, పురానాపూల్ వద్ద పార్క్ చేసుకోవచ్చని వెల్లడించారు.

# ఫిరాయింపుల కేసులో కీలక పరిణామం..

తెలంగాణ: రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మళ్ళీ తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్ నుండి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చర్యలు చేపట్టారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. అయితే తాను పార్టీ మారలేదని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎంను కలిశానని కృష్ణమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహా ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ కార్యాలయం నుంచి నోటీసులు అందాయి.

బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర ఎమ్మెల్యేలు, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం ఈ పిటిషన్లపై జూలై 31న తుది తీర్పు వెలువరించింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల అనర్హతపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేసింది. విచారణకు ప్రభుత్వంలో ఉన్నవారు ఎవరూ ఆటంకాలు కలిగించరాదని, సాకులు చెప్పి విచారణను వాయిదా వేస్తే అది రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లే అవుతుందని కోర్టు స్పష్టం చేసింది. ఎమ్మెల్యేలందరూ ఏదో ఒక రోజు అనర్హత విచారణను ఎదుర్కోవాల్సిందేనని వ్యాఖ్యానించింది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ ప్రసాద్ కుమార్ బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదులపై వివరణ ఇవ్వాలని కోరుతూ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై స్పందించిన కృష్ణమోహన్ రెడ్డి.. తనకు నోటీసులు అందిన విషయాన్ని ధృవీకరించారు. అయితే, తాను పార్టీ మారలేదని, కాంగ్రెస్‌లోకి వెళ్లలేదని స్పష్టం చేశారు. గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశానని, తాను ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నానని తెలిపారు. తన తరఫు న్యాయవాదుల ద్వారా త్వరలోనే నోటీసులకు సమాధానం ఇస్తానని చెప్పారు.





# హిట్ కాంబినేషన్ మరోసారి?

పిల్లల నిర్లక్ష్యానికి గురవుతూ వృద్ధాప్యంలో ఎంతో మదన పడుతూ జీవిస్తున్న తల్లిదండ్రులు చాలా మందే. వీరి జీవితాల్ని తెరపై ఆవిష్కరిస్తూ ఇప్పటికే ఎన్నో చిత్రాలు వచ్చాయి. ఈ కథాంశంతోనే రూపొంది మంచి విజయాన్ని అందుకుంది మరాఠీ చిత్రం 'జునా ఫర్నీచర్'. ఇప్పుడీ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేయడానికి సిద్ధమయ్యారు దర్శకుడు మహేశ్ మంజ్రేకర్. ఇందులో ప్రధాన పాత్రలో నటించడానికి బాలీవుడ్ నటుడు సంజయ్ దత్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. "వాస్తవ్', 'పితా', 'కురుక్షేత్ర' లాంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలు సంజయ్, మహేశ్ కలయికలో రూపొందినవే. ఇప్పుడీ హిట్ కాంబినేషన్ మరోసారి 'జునా ఫర్నీచర్' హిందీ రీమేక్‌తో అలరించడానికి సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో వెల్లడించనున్నార"ని సంజయ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న 'మెగా 157' చిత్రానికి 'మన శంకరవరప్రసాద్ గారు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి 'పండగకి వస్తున్నారు' అనే ట్యాగ్ లైన్ పెట్టారు. చిరు పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌లో ఆయన వింటేజ్ లుక్‌లో అదరగొట్టారు. వెంకటేష్ వాయిస్ ఓవర్ ఈ వీడియోకు మరింత ఆకర్షణ తెచ్చింది. ఈ సినిమాలో వెంకీమామ కూడా నటిస్తున్నారని అనిల్ రావిపూడి తెలిపారు.

మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మెగా 157' చిత్రానికి 'మన శంకరవరప్రసాద్ గారు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'పండగకి వస్తున్నారు' అనే ట్యాగ్ లైన్ కూడా పెట్టారు. చిరు బర్త్ సందర్భంగా టైటిల్ గ్లింప్స్ లాంచ్ చేశారు. ఇందులో చిరుకి వింటేజ్ లుక్‌లో స్వాగ్ తో చూపించారు. విక్టరీ వెంకటేష్ వాయిస్ ఓవర్‌తో వచ్చిన ఈ వీడియో నెట్టింట సందడి చేస్తోంది. ఇది శాంపిల్ మాత్రమే అని, సినిమాలో ఇంకా చాలా లుక్స్ ఉన్నాయని అనిల్ రావిపూడి తెలిపారు. ఈ సినిమాలో వెంకీమామ కూడా నటిస్తున్నారనే విషయాన్ని కన్ఫార్మ్ చేశారు.

'మన శంకరవరప్రసాద్ గారు' టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ లో అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. "మెగాస్టార్ చిరంజీవి బర్త్ డేకి

# వీఎఫ్ఎక్స్ ఏమీ లేదు..



మంచి గ్లిమ్స్ రిలీజ్ చేసి ఫ్యాన్స్ తో పాటుగా, తెలుగు ప్రేక్షకులందరికీ ఈ సినిమా ఎలా ఉండబోతుంది అనేది తెలియజేస్తూ చిన్న లుక్ వదులుదాం అనుకున్నాం. దీనికి రెస్పాన్స్ చాలా బాగుంది. చిరంజీవి సినిమాలు చూస్తూ పెరిగాను నేను. ఆయన సినిమాల్లో 'రౌడీ అల్లుడు', 'ఘరానా మొగుడు', 'గ్యాంగ్ లీడర్' నాకు బాగా నచ్చుతాయి. కంబ్యాక్ తర్వాత అలాంటి స్వాగ్ ని చూడాలనేది నా కోరిక. నాకు ఎప్పుడు అవకాశం వస్తుందా అని ఎదురుచూశాను. ఫైనల్ గా అవకాశం వచ్చింది. నేనేదో ట్రై చేశాను. మీ అందరికీ బాగా నచ్చిందని అనుకుంటున్నాను. ఒకటి మాత్రం చెప్పగలను.. చిరంజీవి గారిని మీరందరూ ఎలా చూడాలనుకుంటున్నారో అలా ఈ సినిమాలో సంక్రాంతికి రెండింతలు చూస్తారు. అదైతే నేను మీకు చెప్పగలను. పాటలు ఎంటర్టైన్మెంట్.. అన్నీ చాలా బాగా కుదిరాయి" అని అన్నారు.

# సైన్యానికి రాజువై నడిపించు పవన్‌కు చిరు ఆశిస్సులు



నీకు తమ్ముడిగా పుట్టడం నా అదృష్టమంటూ చిరంజీవికి పవన్ విషెస్ చెప్పగా.. నీకు అన్నయ్యని అయినందుకు ఎంతో ఆనందంగా ఉందని చిరు అన్నారు. మెగాస్టార్ చిరంజీవి నేడు 70వ పుట్టినరోజు చేసుకుంటు-న్నారు. ఈసందర్భంగా ఆయనకు సోషల్ మీడియాలో పవన్ ఆయనకు విషెస్ చెప్పారు. ఆ శుభాకాంక్షలకు చిరంజీవి స్పందిస్తూ ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ్ముడికి ప్రేమతో ఓ నోట్ విడుదల చేశారు. తమ్ముడు కల్యాణ్.. ప్రేమతో నీవు పంపిన పుట్టినరోజు శుభాకాంక్షలు అందాయి. అందులోని ప్రతి మాట.. ప్రతి అక్షరం నా హృదయాన్ని తాకింది. నన్ను చూసి నువ్వెంత (శూశ ఔశశా) గర్విస్తున్నావో.. నీ విజయాల్ని, నీ పోరాటాన్ని నేనూ అంతగా ఆస్వాదిస్తున్నాను. నీ కార్యదీక్ష, పట్టుదల చూసి ప్రతి క్షణం గర్వపడుతూనే ఉన్నా. నిన్ను నమ్మినవాళ్లకు ఏదో చేయాలన్న తపనే నీకు ఎప్పటికప్పుడు కొత్త శక్తిని ఇస్తుంది. ఈ రోజు నీ వెనక కోట్లాదిమంది జన సైనికులు ఉన్నారు. ఆ సైన్యాన్ని ఓ రాజువై నడిపించు. వాళ్ల ఆశలకు, కలలకు కొత్త శక్తినివ్వు. అభిమానుల ఆశీర్వాదం, ప్రేమ నీకు మెండుగా లభిస్తూనే ఉండాలి. ఓ అన్నయ్యగా నా ఆశీర్వచనాలు ఎప్పుడూ నీకు ఉంటాయి. నీ ప్రతి అడుగులోనూ విజయం నిన్ను వరించాలని ఆ భగవంతుడ్ని కోరుకుంటు-న్నాను' అంటూ అరుదైన ఫొటోలను షేర్ చేశారు.



# డైరెక్టర్‌గా 'చిరుత' బ్యూటీ

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ డెబ్యూ మూవీలో ఆయన సరసన నటించి మెప్పించింది బీహార్ బ్యూటీ నేహా శర్మ . అందులో మిలియనీర్ కూతురిగా పొగరుబట్టిన యువతి ఆమె నటన ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. అంతేకాదు అందాల ప్రదర్శనతో అస్సలు కాంప్రమైజ్ కాకుండా రెచ్చిపోయింది. ఆమెను చూసి తెలుగులో టాప్ హీరోయిన్ అవుతుందని అందరూ అనుకోగా సీన్ రివర్స్ అయింది. ఫస్ట్ మూవీతోనే హిట్ కొట్టినా ఆమెకు పెద్దగా అవకాశాలు రాలేదు. వరుణ్ సందేశ్ సరసన 'కుర్రాడు' మూవీ చేసిన తర్వాత తెలుగులో ఛాన్సులు రాకపోవడంతో తన ఫోకస్ మొత్తం బాలీవుడ్ మీద పెట్టింది. పలు సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌ల్లోనూ నటించింది. స్క్రీన్ మీద ఛాన్సులు లేకపోయినా నేహాశర్మ సోషల్‌మీడియాలో మాత్రం యాక్టివ్ ఉంటుంది. హాట్ ఫోటో షూట్‌లతో నెటిజన్లకు వేడి పుట్టిస్తుంటుంది. అయితే నటిగా పెద్దగా మెప్పించలేకపోయిన నేహా శర్మ ఇప్పుడు కొత్త అవతారమెత్తడానికి సిద్ధమవుతోంది. బాలీవుడ్‌లో వినిపిస్తోన్న కథనం మేరకు ఈ అమ్మడు డైరెక్టర్‌గా మారబోతోందట. బాలీవుడ్ స్టార్ హీరో నిర్మాణంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కబోయే పీరియాడిల్ క్రియేటర్ డ్రామాను నేహా శర్మ డైరెక్ట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. 1945 నాటి స్వాతంత్ర్య పోరాటం నేపథ్యంలో సాగ ఈ చిత్రంలో సిద్ధాంత్ చతుర్వేది, మోహిత్ రైనా తదితరులు కీలక పాత్రల్లో నటించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోన్న ఈ చిత్రానికి సంబంధించి అక్టోబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. ఈ చిత్రాన్ని థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో రిలీజ్ చేసేలా మేకర్స్ ప్లాన చేస్తున్నారట. ఈ ప్రాజెక్టుకి సంబంధించి త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ వచ్చే అవకాశముంది. నటిగా పెద్దగా మెప్పించలేకపోయినా నేహా శర్మ దర్శకురాలిగా అయినా తన ప్రతిభ చాటుకుంటుందేమో చూడాలి.

సినిమాల్లో ఛాన్సులు లేకపోయినా నేహా శర్మ తన సిస్టర్‌తో కలిసి తరుచూ వైరల్ అవుతూనే ఉంటుంది. వీరిద్దరు కలిసి ముంబయి బాంద్రాలోని జిమ్‌కి వస్తుంటారు. టైట్ ఫిట్ దుస్తులో ఉండే వీళ్లని వీడియోలు, ఫోటోలు తీయడానికి యూట్యూబర్లు తెగ ఉత్సాహ పడుతుంటారు. వీళ్లు కూడా ఏమీ దాచుకోకుండా వాళ్లకి సహకరిస్తుంటారు. అంతేకాదు సోషల్‌మీడియాలో నేహా శర్మ పోస్ట్ చేసే ఫోటోలు సెగలు రేపుతుంటారు. ఆమె అందానికి నెటిజన్ల ఫిదా అయిపోతుంటారు. అంత అందమైన అమ్మాయి ఎందుకు టాప్ హీరోయిన్ కాలేకపోయిందని తెగ ఫీలైపోతుంటారు.

# బాలయ్య ఎనర్జీకి ఫిదా అవ్వాల్సిందే



నందమూరి బాలకృష్ణను చూసినవాళ్లెవరైనా ఆయన ఎనర్జీకి ఫిదా అయిపోవాల్సిందే. తాజాగా టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. బాలయ్యతో కలిసి నటించడం ఓ ప్రత్యేక అనుభవంగా మిగిలిందని చెబుతూ, బాలకృష్ణ గారు ఒక వ్యక్తి కాదు... ఓ శక్తి. ఆయన ఒరిజినల్ గా స్క్రీన్ మీద కనిపించేలా నిజ జీవితంలోనూ పవర్ హౌస్ లాంటి వ్యక్తిత్వం కలవారు అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. తెలుగులో మోస్ట్ అవైటెడ్ మూవీగా వస్తున్న అఖండ 2 కోసం బాలయ్య-బోయపాటి శ్రీను మళ్లీ కలిశారు. ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆయన, బాలయ్య గారి పనితీరు, కష్టపడే తత్వం చాలా మందికి స్ఫూర్తిదాయకం. స్క్రీన్ పైనా, ఆఫ్ స్క్రీన్ పైనా ఆయన ఎనర్జీ అసాధారణం అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వ శైలిపై ఆది ప్రశంసలు కురిపిస్తూ, ఆయన డైరెక్షన్‌లో ఓ మ్యాజిక్ ఉంటుంది. బాలయ్య- బోయపాటి కాంబినేషన్ అంటేనే ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఉంటాయి. అలాంటి సినిమా లో నాకూ ఛాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. గతంలోనూ బోయపాటి దర్శకత్వంలో పనిచేసిన అనుభవం ఉందని, ఈ సారి మరింత బలమైన పాత్ర దక్కిందని వెల్లడించారు ఆది. తనకు విలన్ పాత్రల్లో నటించడంపై ఉన్న ఆసక్తిని వెల్లడించిన ఆది, విలన్ క్యారెక్టర్లకు ఎలాంటి పరిమితులు ఉండవు. అవి నటనకు విశేషమైన అవకాశాలు కలిగిస్తాయి. మంచివాడు కాదు, చెడ్డవాడు కాదు, మిడిల్‌లో ఉండే పాత్రలే ఎక్కువ బలాన్నిస్తాయి. అందుకే విలన్ పాత్రలు నాకు ఎక్కువ ఇష్టంగా ఉంటాయి అని అన్నారు. ఇక అఖండ 2 సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేయాలని మొదట భావించగా, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం వల్ల సినిమా వాయిదా పడే అవకాశం ఉందని ఫిలింనగర్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.



# ఒక్కో అడుగూ వేసుకుంటూ

కొద్ది రోజుల్లో 'తేరే ఇష్క్ మే' చిత్రంతో ప్రేమికుడి కోసం పోరాటం చేసే ప్రియురాలిగా తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది బాలీవుడ్ తార కృతి సనన్. ప్రస్తుతం ఇది ముగింపు దశలో ఉండగానే.. మరో ప్రాజెక్టు కోసం సిద్ధమవుతోందీ భామ. కొన్ని రోజులుగా 'కాక్‌టెయిల్ 2'లో షాహిద్ కపూర్, రష్మికతో కలిసి కృతి కనిపించనున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ విషయాన్ని ధృవీకరిస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది కృతి. "ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ఇక్కడికి చేరుకున్నాన"నే అర్థం వచ్చేలా ఓ వ్యాఖ్యను జోడించింది. రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొంది మంచి హిట్‌ను అందుకున్న 'కాక్‌టెయిల్'కు సీక్వెల్ ఇది. హోమి అదజానియా దర్శకత్వం వహిస్తున్నారు.

# సరదాగా...

యువ దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పడతి అనే ఓ కల్పితమైన ఊరు నేపథ్యంలో సాగే కథ ఇది. అక్కడ ప్రతి యువతీ పరదా కప్పుకొనే తిరగాలనేది ఆచారం. పరదా తీసినట్టు- రుజువైతే మాత్రం గ్రామ దేవత జ్వాలమ్మ ముందు ఆత్మార్పణ చేసుకోవాల్సి ఉంటుంది. అనాదిగా వస్తున్న ఆ ఆచారాన్ని కొనసాగిస్తున్న ఊరి యువతి సుబ్బు (అనుపమ పరమేశ్వరన్) ఊహించని రీతిలో చిక్కుల్లో పడుతుంది. పరదా లేని ఆమె ఫొటో బయటకి రావడమే అందుకు కారణం. తాను ఆచారాన్ని తప్పలేదని వేడుకున్నా... ఆత్మార్పణ చేసుకోవాల్సిందే అని ఊరి ప్రజలు తీర్మానం చేస్తారు. ఒక పక్క తాను మనసిచ్చిన రాజేశ్ (రాగ్ మయూర్)తో నిశ్చితార్థానికి సిద్ధం అవుతుండగానే ఇదంతా జరుగుతుంది. ఆచారం ప్రకారం ప్రాణాలైనా వదలాలి, లేదంటే తప్పు చేయలేదనైనా నిరూపించుకోవాలని కోరతారు ఊరి ప్రజలు. దాంతో సుబ్బు తాను తప్పు చేయలేదని నిరూపించుకోవడం కోసం ధర్మశాలకి పయనం కావాల్సి వస్తుంది. ఆ ప్రయాణం ఎలా సాగింది? తనకి తోడుగా నిలిచిన రత్న (సంగీ), అమిష్ట (దర్శన రాజేంద్రన్) ఎవరు? ఇంతకీ పరదా లేని సుబ్బు ఫొటో ఎలా బయటికొచ్చింది? పడతి అనే ఊరు అనుసరిస్తున్న కఠినమైన ఆ కట్టుబాటు- వెనక చరిత్ర ఏమిటి?సుబ్బు తాను తప్పు చేయలేదని నిరూపించుకుందా లేదా అన్నకథలో సాగిందీ సినిమా. ముగ్గురు మహిళల స్నేహాల్ని, ఒకరి సమస్య కోసం ముగ్గురూ కలిసి చేసిన స్వేచ్ఛా విహారాన్ని అందంగా, ఆలోచన రేకెత్తించేలా ఆవిష్కరిస్తుంది. దైనందిన జీవితాల నుంచి బయటికొచ్చి చేసిన ఆ ప్రయాణం వాళ్లకు ఏం నేర్పింది?వాళ్లలో ఎలాంటి మార్పుని తీసుకొచ్చింది? సమాజం ముందు ఎలాంటి ప్రశ్నల్ని లేవనెత్తిందన్నది ఇందులో కీలకం. సమానత్వం అంశం ఎప్పుడు ప్రస్తావనకి వచ్చినా అవతలి వాళ్లవైపు వేళ్లు వెళుతుంటాయి. కానీ, ఈ సినిమా అందుకు భిన్నమైన విషయాల్నీ ప్రస్తావించింది. మనుషుల్లో మార్పుని, ఆ అవసరాన్ని సూచిస్తుంది. అయితే, చెబుతున్న కథ కొత్తదైనా... పాతదైనా తెరపై ఎంత ఆసక్తికరంగా సాగిందన్నదే కీలకం.



Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,